www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
30-12-2024
సంపుటి : 01 | సంచిక : 238 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## రాబోయేది గులాబీ జెండా శకమే

- ఎలాంటి సందేహం లేదు
- ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాపై ప్రభుత్వం మాట్లాడటం లేదు
- గురుకులాలను నడపడానికి కూడా చేతకావడం లేదు
- ఉద్యోగాల పేరిట సీఎం రేవంత్ రెడ్డి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు
- ఆటో కార్మికులకు ఇబ్బందులు అన్నీఇన్నీ కాదు
- డిగ్రీ చదివిన ఆడపిల్లలకు స్కూటీల పంపిణీ ఏమైంది..?
- కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేకనే నాపై, కేటీఆర్‌పై అక్రమ కేసులు..
- ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదు
- నిజామాబాద్ బహిరంగసభలో ఎమ్మెల్సీ కవిత



**విశ్వంభర, నిజామాబాద్:** రాష్ట్రంలో రాబోయేది గులాబీ జెండా శకమేనని, అందులో ఎలాంటి సందేహం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడిన ఆమె.. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానేనని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాపై ప్రభుత్వం మాట్లాడటం లేదని, గురుకులాలను నడపడానికి కూడా ప్రభుత్వానికి చేతకావడం మిగతా2లో...

## రైతు భరోసా ఇచ్చి తీరుతాం

- విధివిధానాలపై మంత్రుల కమిటీ కసరత్తు
- ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట మేరకు ముందుకు వెళ్తున్నాం: భట్టి విక్రమార్క
- సచివాలయంలో రైతు భరోసాపై సబ్ కమిటీ సమావేశం


2





భారతీయ చలనచిత్ర రంగం వైపు చూస్తున్న

# ప్రపంచ దేశాలు



## తెలుగు సినిమాను అక్కినేని మరో స్థాయికి తీసుకువెళ్లారు

- తపన్ సిన్హా సినిమాలు సమాజానికి కొత్త బాటలు వేశాయి
- రాజ్ కపూర్ సున్నితమైన అంశాలను ప్రపంచానికి పరిచయం చేశారు
- తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌ను వచ్చే ఏడాది మన దేశంలో నిర్వహించబోతున్నాం
- మనకీ బాత్‌లో ప్రధాని మోడీ
- ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహాకుంభ మేళాను ఐక్యతా మేళాగా అభివర్ణించిన ప్రధాని

**ఢిల్లీ:**
ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 117వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోఢీ పలు విషయాలు పంచుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాకు చేసిన కృషిని కొనియాడారు. తెలుగు సినిమాను ఆయన మరోస్థాయికి తీసుకువెళ్లారని ప్రశంసించారు. నాగేశ్వరరావు సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలను చాలా చక్కగా చూపించేవారని గుర్తు చేసుకున్నారు. బాలీవుడ్ దర్శకుడు తపన్ సిన్హా సినిమాలు సమాజానికి కొత్త బాటలు వేశాయని పేర్కొన్నారు. రాజ్ కపూర్ తన సినిమాల ద్వారా భారతదేశంలోని సున్నితమైన అంశాలను ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. భారతీయ చలనచిత్ర రంగం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని ప్రధాని అన్నారు. తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌ను వచ్చే ఏడాది మన దేశంలో నిర్వహించబోతున్నామని ప్రధాని చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీడియా, మిగతా2లో...

## నేడు పీఎస్ఎల్‌వీ సీ60 రాకెట్ ప్రయోగం

- 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు
- సూళ్లూరుపేట షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి రాత్రి 9.58గంటలోకి నింగిలోకి ప్రవేశపెట్టనున్న శాస్త్రవేత్తలు



9

## ప్రభుత్వం మెడలు వంచితీరుతాం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం చెల్లించాలి
- లక్షలాది మంది విద్యార్థులు అల్లాడిపోతున్నారు
- కాలేజీ యాజమాన్యాలు నష్టపోయి కాలేజీలు ముసుకునే దుస్థితి
- ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు
- బకాయిలు చెల్లించకపోతే సంక్రాంతి తర్వాత మహోద్యమమే..
- కాంగ్రెస్ ప్రభుత్వానికి కేంద్రమంత్రి బండి సంజయ్ అల్టిమేటం

2

ఫార్ములా-ఈ కారు రేసింగ్ వ్యవహారంలో

## దొంగలు దొరికారు

- ఓఆర్ఆర్ టోల్‌లీజ్‌లో అవకతవకలు కూడా బయటపడతాయి
- హరీశ్‌రావు తన మామ, బామ్మర్దిని ఇరికించేందుకే సిట్ వేయాలని అడిగారు
- ఆర్ఆర్ఆర్ కోసం ఢిల్లీలో ఉండి ఎంతో కృషి చేశాను
- 2017లో ఆగిపోయిన ప్రాజెక్టుకు మా కృషి వల్ల ముందడుగు పడింది: మంత్రి కోమటిరెడ్డి

2



## ఈ ఏడాది 2 లక్షలకు పైగా కేసులు నమోదు

నేర వార్షిక నివేదికను విడుదల చేసిన డీజీపీ జితేందర్

2

## మహా కుంభమేళాకు సిద్ధమవుతోన్న ప్రయాగ్‌రాజ్



2

- 50 వేలమందితో భద్రత..
- 27 వేల 'ఏఐ' కెమెరాలు..
- అండర్‌వాటర్ డ్రోన్లు
- ఈ ఉత్సవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## మాతృభాషను పరిరక్షించుకుందాం

- తెలుగుకు వెలుగులు తీసుకొద్దాం
- తెలుగు భాష, తెలుగు జాతి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాలి
- ఆ బాధ్యత కవులు, రచయితలపై ఉంది
- మండలి బుద్ధప్రసాద్
- ముగిసిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు



2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 105 | ₹ 127 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 184 | ₹ 210 |



# భారతీయ చలనచిత్ర రంగం వైపు చూస్తున్న ప్రపంచ దేశాలు

**మొదటిపేజీ తరువాయి**

వినోద పరిశ్రమకు చెందిన ప్రపంచ దేశాల దిగ్గజాలు పాల్గొంటారని తెలిపారు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ.. రాజ్యాంగం భారతీయులందరికీ ఓ మార్గనిర్దేశకం అని ప్రధాని నరేంద్ర మోఢీ అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పవిత్ర గ్రంథంపై ప్రజలు తమ అభిప్రాయాలను వీడియోలుగా రూపొందించి.. ఈ వెబ్‌సైట్‌లో పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ 75 ఏళ్ల సంబరాల్లో ప్రజలను భాగం చేయాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించామన్నారు. అంతే కాకుండా ఈ వెబ్‌సైట్లో అనేక భారతీయ భాషల్లో రాజ్యాంగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని.. అన్ని భాషల వారు రాజ్యాంగ పీఠికను.. అనేక విషయాలను చదివి.. అర్థం కాని వాటిపై ప్రశ్నలు సైతం అడగవచ్చని ప్రధాని తెలిపారు. జనవరి 13 నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహాకుంభ మేళాను ఐక్యతా మేళాగా అభివర్ణించారు. దీనికి సంబంధించిన టూర్ ప్యాకేజీలు, వసతి వంటి సమాచారం తెలుసుకోవడానికి భక్తులకు ఏఐ చాట్‌బాట్ 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు. అందులోని డిజిటల్ నావిగేషన్ సహాయంతో భక్తులు కుంభమేళాలోని వివిధ ఘాట్‌లు, దేవాలయాలు, సాధువుల శిబిరాలను చేరుకోగలుగుతారని పేర్కొన్నారు. కుంభమేళాలో తప్పిపోయిన వారిని కనుగొనడానికి ఏఐ అధారిత కెమెరాలను, డిజిటల్ లాస్ట్ అండ్ ఫౌండ్ సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోబోటిక్ ఫైర్ టెండర్లు సైతం వినియోగిస్తున్నట్లు తెలిపారు.

# రైతు భరోసా ఇచ్చి తీరుతాం

**విశ్వంభర, హైదరాబాద్:** సంక్రాంతి పండగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రజా ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చేందుకు కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట మేరకు ముందుకు వెళ్తున్నామన్నారు. సచివాలయంలో రైతు భరోసాపై సబ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, కమిటీ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. రానున్న యాసంగి పంటకు రైతు భరోసా అందజేసేందుకు ఖరారు చేయాల్సిన విధివిధానాలపై రెండు గంటల పాటు మంత్రులు కసరత్తు చేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు రైతు భరోసా అందించిన తీరు.. క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, అధికారులు సేకరించిన సమాచారంపై మంత్రులు కసరత్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇచ్చి తీరుతామని భట్టి విక్రమార్క తెలిపారు.

# ఈ ఏడాది 2 లక్షలకు పైగా కేసులు నమోదు

**విశ్వంభర, హైదరాబాద్:** ఈ ఏడాది కేసుల నమోదు పెరిగిందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన నేర వార్షిక నివేదికను విడుదల చేసి మాట్లాడారు. ఈ ఏడాది 2 లక్షలకు పైగా కేసులు నమోదు అయ్యాయన్నారు. డ్రగ్స్ లేని తెలంగాణ సాధనే పోలీసు శాఖ లక్ష్యమని చెప్పారు. మోసాలకు పాల్పడుతున్న 1800 వెబ్‌సైట్ యూఆర్‌ఎల్‌లను బ్లాక్ చేసినట్లు తెలిపారు. ''కొత్త నేర చట్టాల అమలు కోసం పోలీసులకు శిక్షణ ఇచ్చాం. డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ ఏడాది 33,618 సైబర్ క్రైమ్ కేసులను నమోదు చేశాం. 1525 కిడ్నాప్, 703 చోరీ, 58 దోపిడీ, 856 హత్య, 2945 అత్యాచారాల కేసులు నమోదు చేశాం. డయల్ 100కు 16,92,173 పిర్యాదులు వచ్చాయి. కొత్త చట్టం వచ్చిన తర్వాత 85,190 కేసులను నమోదు చేశాం. కొత్త చట్టం ప్రకారం సైబరాబాద్ పరిధిలో 15,360, హైదరాబాద్‌లో 10,501, రాచకొండలో 10,251 కేసులను నమోదు చేశాం. సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.180 కోట్లను తిరిగి బాధితులకు అప్పగించాం. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 142.95 కోట్లు మాద్రకద్రవ్యాలను సీజ్ చేశాం. డ్రగ్స్ కేసుల్లో 4,682 మంది నిందితులను అరెస్టు చేశాం.

**సంధ్య థియేటర్ ఘటనలో దర్యాప్తు సాగుతోంది**

వ్యక్తిగతంగా లేదా కుటుంబ సమస్యలతో పోలీసుల ఆత్యహత్యలు జరుగుతున్నాయి. పోలీసు శాఖ పరంగా ఎలాంటి సమస్యలు లేవు. చాలా చోట్ల వ్యక్తిగత కారణలతోనే ఆత్మహత్యలు జరుగుతున్నాయి. సంధ్య థియేటర్ ఘటన కేసులో దర్యాప్తు సాగుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి సీబీఐకి లేఖ రాశాం. నిందితులను విదేశాల నుంచి భారత్‌కు రప్పించాలంటే ఇంటర్నేషనల్ ప్రాసెస్ జరుగుతుంది. ఇందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకుంటున్నాం. కేసులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావును హైదరాబాద్‌కు తీసుకురావడానికి సమయం పడుతుంది'' అని డీజీపీ జితేందర్ చెప్పారు.

# ఫార్ములా-ఈ కారు రేసింగ్ వ్యవహారంలో దొంగలు దొరికారు

**విశ్వంభర, హైదరాబాద్:** ఓఆర్ఆర్ లీజు అంశంపై విచారణ జరుగుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తన మామ, బామ్మర్దిని ఇరికించేందుకే ఓఆర్ఆర్ టోల్ లీజ్‌పై సిట్ వేయాలని అడిగారని మంత్రి అన్నారు. హరీశ్‌రావు అసెంబ్లీలో కోరడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి సిట్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫార్ములా-ఈ కారు రేసింగ్ వ్యవహారంలో దొంగలు దొరికారన్నారు. '' ఓఆర్ఆర్ టోల్‌లీజ్‌లో అవకతవకలు కూడా బయటపడతాయి. ఆర్ఆర్ఆర్ కోసం దిల్లీలో ఉండి ఎంతో కృషి చేశాను. 2017లో ఆగిపోయిన ప్రాజెక్టుకు మా కృషి వల్ల ముందడుగు పడింది. ఆర్ఆర్ఆర్ మంజూరు చేసిన ప్రధానికి కృతజ్ఞతలు. దీనికి సహకరించిన కేంద్రమంత్రి గడ్కరీకి ధన్యవాదాలు'' అని కోమటిరెడ్డి తెలిపారు.



# రాబోయేది గులాబీ జెండా శకమే

**మొదటిపేజీ తరువాయి**

లేదని మండిపడ్డారు.గురుకులాలను సక్రమంగా నిర్వహించలేక ఇప్పటికే 57 మంది పిల్లలను పొట్టనపెట్టుకున్నారని కవిత విమర్శించారు. ఇంకా ఎంత మందిని పొట్టనపెట్టుకుంటారని ప్రశ్నించారు. ఉద్యోగాల పేరిట సీఎం రేవంత్ రెడ్డి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటివరకు కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకే పరీక్షలు నిర్వహిస్తోందని ఎద్దేవా చేశారు.ఆటో కార్మికులకు ఇబ్బందులు అన్నీఇన్నీ కాదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, ఉచిత సదుపాయం కల్పించిన ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్యను తగ్గించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు శిష్యుడని అన్నారు. రేవంత్ సర్కారు తెలంగాణ తల్లి స్థానంలో కాంగ్రెస్ మాతను ఏర్పాటు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మన పొట్టమీద కొట్టడమే కాదని, మన సంస్కృతిపై కూడా దాడి చేస్తున్నదని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదని, మళ్లొకసారి నిజామాబాద్ దమ్ము ఏమిటో సీఎం రేవంత్ రెడ్డికి రుచి చూపిద్దామని కవిత పిలుపునిచ్చారు.

**డిగ్రీ చదివిన ఆడపిల్లలకు స్కూటీల పంపిణీ ఏమైంది..? ..**

ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవిమాలిన హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. డిగ్రీ చదివిన ఆడబిడ్డలకు స్కూటీలు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఇప్పుడా హామీ సంగతి ఏమైందని ఆమె ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వలేదని, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇవ్వలేదని ఆమె ఫైరయ్యారు.



అదేవిధంగా మైనారిటీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కారు అమలు చేయలేదని కవిత ఆరోపించారు. బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటివరకు పెన్షన్‌లను కూడా పెంపు చేయలేదని విమర్శించారు. మనం ఊరుకుంటే ప్రభుత్వం కదలదని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఆమె పిలుపునిచ్చారు.విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కవిత మండిపడ్డారు. పీపుల్స్ ఫ్రెండ్లీ పోలిసింగ్ పోయి రాష్ట్రంలో కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ జులుం నడుస్తున్నదని, కేసీఆర్ ప్రవేశపెట్టిన మంచి పథకాలను ప్రభుత్వం కొనసాగించాలని అన్నారు.

**కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేకనే నాపై, కేటీఆర్‌పై అక్రమ కేసులు..**

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేకనే తనపైన, కేటీఆర్‌పైన అక్రమ కేసులు పెడుతున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. నిజామాబాద్‌లో ఇవాళ జరిగిన బహిరంగసభలో ఆమె ప్రసంగించారు. అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా పిడికిలి ఎత్తి, అన్నీ ఎదిరించి వచ్చానని, తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని, దేనికీ భయపడనని అన్నారు. మాది భయపడే రక్తం కాదని, భయపెట్టే రక్తమని చెప్పారు.తాము ఏ తప్పు చేయలేదని, కాబట్టి భయపడే ప్రసక్తే లేదని కవిత అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటికి వస్తారని చెప్పారు. కేంద్రాన్ని ఎదురించి ప్రశ్నిస్తే బీజేపీ కేసులు పెడుతోందని విమర్శించారు. ఇక రాష్ట్రంలో అక్రమ కేసులపై గురించి అయితే చెప్పనవసరం లేదని, సీఎం పేరు మర్చిపోయినా.. రైతులు భూములు ఇవ్వకపోయినా కేసులు పెడుతున్నారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎందుకింత భయమని ప్రశ్నించారు.బరువు ఎత్తుకున్నోడు ఓపికతో ఉండాలని, సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర ఆ ఓపిక లేదని కవిత విమర్శించారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికే అధికారం ఇచ్చారన్న విషయాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మరిచిపోయాయని ఎద్దేవా చేశారు. తాము పోరాటం చేసి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన వాళ్లమని, గట్టిగా నిలబడుతామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు.

# ప్రభుత్వం మెడలు వంచితీరుతాం

**విశ్వంభర, కరీంనగర్:** సంక్రాంతి లోపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కిషన్ రెడ్డి అధ్యక్షతన మహోద్యమం చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు అల్లాడిపోతున్నారని బండి సంజయ్ అన్నారు. కాలేజీ యాజమాన్యాలు నష్టపోయి కాలేజీలు మూసుకునే దుస్థితి వచ్చిందని.. దీంతో ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని చెప్పారు. సంక్రాంతిలోపు బకాయిపడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచి తీరుతామని అల్టిమేటం జారీ చేశారు.అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ మండిపడ్డారు. ఇప్పటివరకు 25 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి.. 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గప్పాలు కొడుతోందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగులు ఉద్యోగాల్లేక ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట నిరుద్యోగులకు ఇచ్చిన హమీలన్నీ కాంగ్రెస్ తుంగలో తొక్కిందని మండిపడ్డారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని మాట తప్పిందన్నారు. ఒక్కో నిరుద్యోగికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.48 వేలు బకాయి పడిందని.. బకాయి పడ్డ ఆ డబ్బును వెంటనే నిరుద్యోగులకు ఇవ్వాలని సూచించారు. అలాగే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.మన్మోహన్ అంత్యక్రియలపై కాంగ్రెస్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు...మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై కాంగ్రెస్ రాజకీయం చేయడం సిగ్గుచేటు అని బండి సంజయ్ విమర్శించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న పదేళ్లు సూపర్ ప్రధానిగా సోనియాగాంధీ కొనసాగుతూ రబ్బర్ స్టాంప్‌గా మార్చేసిందని ఆరోపించారు. అలాగే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రజాప్రతినిధ్యం చట్టంలోని నిబంధనలను సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తే.. ఆ ఆర్డినెన్స్ కాపీలను రాహుల్ గాంధీ చింపివేసి మన్మోహన్‌ను దారుణంగా అవమానించారని అన్నారు. కానీ మన్మోహన్ సింగ్ సేవలను గుర్తించి అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించి ఆయనకు ఢిల్లీలోనే స్మారక స్థల్ నిర్మించేందుకు సిద్ధమైందని తెలిపారు. మాజీ ప్రధానిగా పనిచేసిన పీవీ నర్సింహరావు అంత్యక్రియలను ఢిల్లీలో నిర్వహించకుండా అవమానించిన కాంగ్రెస్ పార్టీకి.. మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత లేదని అన్నారు.



# మహా కుంభమేళాకు సిద్ధమవుతోన్న ప్రయాగ్‌రాజ్

**ప్రయాగ్‌రాజ్:** మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోఢీ సైతం తన 'మన్‌కీ బాత్'లో మహా కుంభమేళాను ప్రస్తావించారు. దీన్ని ఐక్యతా మేళాగా పేర్కొన్నారు. ఆధ్యాత్మికత, సంస్కృతి, భద్రత, ఆధునికతల మేళవింపుగా ఈ వేడుకను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సాంస్కృతిక శాఖ తెలిపింది. దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించింది.



- భద్రత కోసం పారామిలిటరీ బలగాలు సహా 50 వేల మంది సిబ్బంది మోహరింపు
- కృత్రిమ మేధ సాంకేతికతతో కూడిన 2700 కెమెరాల ఏర్పాటు.. తొలిసారి అండర్‌వాటర్ డ్రోన్ల వినియోగం
- పోలీస్ స్టేషన్‌లలో సైబర్ హెల్ప్ డెస్కులు, 56 మంది సైబర్ వారియర్ల బృందం అందుబాటులో కుంభమేళా సమాచారం తెలుసుకునేందుకు 11 భారతీయ భాషల్లో ఏఐ చాట్‌బాట్
- శస్త్రచికిత్స, రోగనిర్ధరణ సౌకర్యాలతో కూడిన తాత్కాలిక ఆసుపత్రులు.. ఏకకాలంలో 200 మందికి చికిత్స అందించగల భీష్మ క్యూబ్ ఏర్పాటు
- 'నేత్ర కుంభ్' శిబిరం ద్వారా ఐదు లక్షల మంది యాత్రికులకు కంటి పరీక్షలు, మూడు లక్షలకుపైగా కళ్లద్దాల పంపిణీకి చర్యలు
- భక్తులకు తాత్కాలిక వసతి కల్పించేందుకు వేలాది టెంట్లు, షెల్టర్లతో మహా కుంభ్‌నగర్ ఏర్పాటు.. గూగుల్ మ్యాప్స్‌తో అనుసంధానం
- మహా కుంభమేళా కోసం.. అండర్‌వాటర్ డ్రోన్లు
- మార్గనిర్దేశం చేసేందుకు హిందీ, ఇంగ్లీష్, ప్రాంతీయ భాషలతో కూడిన 800 బోర్డుల ఏర్పాటు
- 92 రోడ్ల పునర్నిర్మాణం, 17 ప్రధాన రహదారుల సుందరీకరణ పనులు తుదిదశకు.. అదేవిధంగా 30 తేలియాడే వంతెన (పాంటూన్ బ్రిడ్జ్)ల నిర్మాణం
- అవాంఛనీయ ఘటనలు జరిగితే సకాలంలో స్పందించేలా పకడ్బందీ ఏర్పాట్లు.. అత్యాధునిక బహుళ-విపత్తు ప్రతిస్పందన వాహనాల మోహరింపు
- అగ్నిప్రమాదాలను కట్టడి చేసేందుకు నాలుగు ఆర్టిక్యులేటింగ్ వాటర్ టవర్స్ వాహనాలు అందుబాటులో
- లైటింగ్ కోసం సౌరశక్తి, పునర్వినియోగ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, ఒకేసారి ఉపయోగించే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌పై నిషేధం
- దేశ సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయాగ్‌రాజ్‌లో 'కళాగ్రామ్' ఏర్పాటు



# మాతృభాషను పరిరక్షించుకుందాం..

**విశ్వంభర, విజయవాడ:** తెలుగు భాష, తెలుగు జాతి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉందని 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల గౌరవాధ్యక్షుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్‌జిల్లా విజయవాడలో రెండ్రోజుల పాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడారు.''చెన్నైలో ఇటీవల ఓ సినీనటి మాట్లాడుతూ.. తమిళనాడుకు తెలుగువారు పరిచారకులు (సేవకులు)గా వచ్చారని చెప్పారు. అది వాస్తవం కాదు. తమిళనాడును మొదట పాలించింది తెలుగువారే... ఆ తర్వాతే తమిళులు. భారత దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కూడా ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి అత్యధిక సంఖ్యలో ముఖ్యమంత్రిగా పనిచేసింది కూడా తెలుగువారే. శ్రీకృష్ణ దేవరాయలు, రాణి మంగమ్మ, నాయకరాజులు తెలుగులోనే పరిపాలన చేశారు. తమిళనాట తెలుగు ఓ వెలుగు వెలిగింది తప్ప.. దాస్య ప్రవృత్తితో తెలుగువారు అక్కడ లేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.స్వాతంత్య్రోద్యమానికి నాయకత్వం వహించేందుకు తమిళులెవరూ ముందుకు రాలేదు. సైమన్ కమిషన్ వస్తే గుండుకు ఎదురుగా గుండె చూపిన వ్యక్తి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. ఉప్పు సత్యాగ్రహానికి మహాత్మాగాంధీ పిలుపునిస్తే.. కాశీనాథుని నాగేశ్వరరావు, ప్రకాశం పంతులు, దుర్గాభాయమ్మ నాయకత్వం వహించారు. మద్రాసు నగరంలో ఏ కార్యక్రమమైనా విజయవంతంగా నడిపించిన ఘనత తెలుగువారిది. మనలో భాషాభిమానం, జాతీయాభిమానం తగ్గింది. ఫలితంగా తమిళనాడులో ఉన్న తెలుగువారు.. తెలుగువారని నమోదు చేసుకోకపోవటంతో రెండో స్థానంలో ఉన్న తెలుగు భాష నాలుగో స్థానానికి పడిపోయింది. త్వరలో జరగబోయే జనగణనలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రతి తెలుగు వ్యక్తి.. తెలుగువారని నమోదు చేసుకోవడం ద్వారా తెలుగు భాషను మళ్లీ రెండో స్థానానికి తీసుకెళ్లాలి. మహాసభలకు విచ్చేసిన కవులు, రచయితలు తెలుగు భాషను, తెలుగు జాతిని ముందుకు తీసుకెళ్లేందుకు యోధులుగా మారాలి'' అని బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు.

# మనం అదృష్టవంతులం కాదు.. శత్రువులతో అప్రమత్తంగా ఉండాల్సిందే: రాజ్‌నాథ్ సింగ్



**భోపాల్:** భారత భద్రతా వ్యవస్థపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భద్రత విషయంలో మనం అంత అదృష్టవంతులం కాదని అన్నారు. బాహ్యంగా, అంతర్గతంగా శత్రువుల కదలికలపై దృష్టి పెట్టాలని సైన్యానికి సూచించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్ జిల్లాలోని మావ్ కంటోన్మెంట్ వద్ద ఆర్మీ సిబ్బందిని ఉద్దేశించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''దేశ భద్రతను పరిగణనలోకి తీసుకుంటే మనం అంత అదృష్టవంతులం కాదు. ఎందుకంటే.. ఉత్తర, పశ్చిమ సరిహద్దు ప్రాంతాల్లో నిత్యం సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. అంతేకాకుండా.. అంతర్గతంగానూ భద్రతా పరమైన ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఈ పరిస్థితి పట్ల ఆందోళన లేకుండా నిశ్శబ్దంగా కూర్చోలేం. శత్రువులు కార్యకలాపాలపై మరింత నిఘా అవసరం. వారి కదలికలను గమనిస్తూనే ఉండాలి. అప్పుడే వారి కుట్రను భగ్నం చేయగలం'' అని రాజ్‌నాథ్ సింగ్ ఆర్మీ సిబ్బందికి సూచించారు. భారత్ అభివృద్ధి ప్రయాణంలో సైన్యం పాత్ర కీలకమని అన్నారు. ''రక్షణమంత్రిగా నేను మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. నేను ఇక్కడికి వచ్చినప్పుడల్లా మీరు తీసుకుంటున్న కఠినమైన శిక్షణతో పాటు మీ అంకితభావాన్ని చూశాను. దేశం పట్ల బాధ్యతాయుతమైన మీ తీరు.. మాలో స్ఫూర్తి నింపుతోంది '' అని అన్నారు.




# మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించాలి

## సినిమా పాటల పోకడ మారాలి: రచయిత అనంత శ్రీరామ్



**ప్రపంచ 6వ తెలుగు రచయితల మహాసభలు శనివారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. తొలిరోజు సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, మార్గదర్శి ఎండి శైలజా కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభలను ప్రారంభించారు. ఆదివారం రెండో రోజు నగరంలోని కేబీఎన్ కళాశాలలో ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభలు రెండో రోజు నిర్వహించారు. దీనిలో భాగంగా 'ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇతర రాష్ట్రాలు, వివిధ దేశాల నుంచి వచ్చిన తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. మరో వేదికపై తెలుగులో న్యాయపాలనపై సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ బి.కృష్ణమోహనరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ నగేశ్ భీమపాక హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.**

**విశ్వంభర, విజయవాడ:** సినిమా పాటల విషయంలో పోకడ మారాల్సిన అవసరం ఉందని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. విజయవాడలో జరిగిన 6వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ప్రసంగించారు. ప్రేమ గురించి తప్ప ఇతర పాటలు సినిమాల్లో ఉండట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సినిమాల కోసం కాకుండా అప్పుడప్పుడు తన సంతృప్తి కోసం కొన్ని పాటలు రాసుకుంటానని చెప్పారు.''సినిమా పాటలు రాస్తున్నప్పుడు ఎక్కడో ఒక చోట అసంతృప్తి ఉంటుంది. అది పెద్ద సినిమా అయితే హీరో పరిచయగీతం. హీరోయిన్ హీరోను చూసినప్పుడు వచ్చే ఒక ప్రేమ పాట. హీరో.. హీరోయిన్‌కి ప్రేమ కుదిరినప్పుడు వచ్చే ఒక యుగళగీతం. రెండో అర్ధ భాగంలో హీరో పోరాటానికి వెళ్తున్నప్పుడు.. నువ్వు సింహం, పులి అని పొగిడే పాట. ఆ తర్వాత సినిమాకి ఒక ఆట విడుపు ఇవ్వాలి కాబట్టి. ప్రత్యేక గీతం (ఐటమ్ సాంగ్). ఆఖర్లో అంతా సంతోషం వైపు పయనిస్తున్నామని హీరో.. హీరోయిన్లు నిర్ణయించుకుంటున్నప్పుడు వచ్చే ఉత్సాహ భరితమైన పాట. ఇదే సూత్రంతో పెద్ద సినిమాలు నడుస్తున్నాయి. చిన్న సినిమాలైతే ..ప్రేమ పుట్టినప్పుడు, వికసించినప్పుడు, ప్రేమ భగ్నమైనప్పుడు, మళ్లీ కలుసుకున్నప్పుడు వచ్చే పాటలు తప్పితే ఇంతకు మించిన సన్నివేశాల సృష్టి జరగట్లేదు. అదృష్టవశాత్తూ ఈ సంక్రాంతికి విడుదలవుతున్న 'సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమాలో గురువుపై అద్భుతమైన పాట రాసే అవకాశం లభించింది. త్వరలో మీరు కూడా ఆ పాటను వింటారు.సినిమా పాటలు రాస్తూ మన వ్యాసాంగం కుంటు పడకూడదన్న ఉద్దేశంతో అప్పుడప్పుడు నా సంతృప్తికోసం కూడా పాటలు రాస్తుంటా. అంతర్వేది వద్ద గోదావరి సముద్రంలో కలుస్తున్నప్పుడు, కృష్ణానది హంసలదీవి వద్ద సముద్రంలో కలిసే ప్రాంతాన్ని చూస్తే T ఆకారంలో కనిపిస్తుంది. ఆ అద్భుత దృశ్యాన్ని చూసినప్పుడు పాట రాయాలనిపించింది. ''ఎన్ని నదులు కలిస్తే.. ఎన్నెన్ని నదులు కలిస్తే ఏ లాభం. కడలిలో ఉప్పదనం కాస్త కూడా తగ్గనప్పుడు. ఎన్ని నదులు కలిస్తే ఏం లాభం. ఎన్నెన్ని గుడులు వెలిస్తే ఏ లాభం'' అంటూ తాను రాసిన పాటు సభికులకు వినిపించారు. సింగిల్ బెడ్‌రూమ్ కొందామా? డబుల్, త్రిబుల్ బెడ్ రూమ్ కొందామా? అని ఇలా బెడ్ రూమ్‌ల సంఖ్యతో మన స్థాయిని కొలుచుకునే పరిస్థితి వచ్చింది. అంటూ.. ''ఎన్ని గదులు తెరిస్తే ఏం లాభం'' అంటూ మరో గేయాన్ని ఆలపించారు. అనంత శ్రీరామ్ ఆలపించిన రెండు గేయాలను సభికులను అలరించడంతో పాటు ఆలోచింపజేశాయి.

**ఆంగ్లంలో ఉన్న జీవోలు తెలుగులో రావాలి: అశోక్ బాబు**

రాజకీయ వ్యవస్థ తలుచుకుంటేనే తెలుగు భాష అభివృద్ధి చెందుతుందని టీడీపీ ఎమ్మెల్సీ పి.అశోక్ బాబు అన్నారు. తెలుగుభాష పరిరక్షణకు వ్యక్తిగతంగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. '' ఆంగ్ల భాష గొప్పదని, గత ప్రభుత్వం హయాంలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతూ అప్పటి ముఖ్యమంత్రి గొప్పగా చెప్పారు. జాతీయ విద్యావిధానంలో ఐదో తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధన జరగాలని స్పష్టంగా ఉంది.భాషను అభివృద్ధి చేసే బాధ్యత రాజకీయ వ్యవస్థపైనే ఎక్కువగా ఉంటుంది. తెలుగు భాష విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోంది. వచ్చేవిద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో విద్యా విధానంలో మార్పులు వస్తాయని ఆశిస్తున్నా. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ప్రభుత్వం ఆంగ్లంలో ఉన్న జీవోలను తెలుగులో ఇవ్వలేకపోతోంది. దేశ భాషలందు తెలుగు లెస్స అనే స్థాయిని తిరిగి తెలుగుకు తీసుకురావాలి'' అని అశోక్ బాబు అన్నారు.

**తెలుగులో తీర్పులు.. వాళ్లిద్దరే స్ఫూర్తి: జస్టిస్ భీమపాక నగేశ్**

మాతృభాషలో డాక్యుమెంట్ ఉన్నా కొందరు ఆత్మన్యూనతతో ఆంగ్లంలో చదువుతున్నారని జస్టిస్ భీమపాక నగేశ్ అన్నారు. తాము తెలుగులో తీర్పు ఇస్తే ఆంగ్లంలో అభినందనలు వచ్చాయని చెప్పారు. ''మాతృభాషలో చదువుకునే హైకోర్టు న్యాయమూర్తుల స్థాయికి ఎదిగాం. తెలుగు భాష సహకారంతో వృత్తిపరంగా ఎక్కువ బాగుపడ్డా. మాతృభాషలో తీర్పు ఇచ్చేందుకు నాకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్వీ రమణ స్ఫూర్తి. తెలుగును బాగా చదవగలిగితే ఆంగ్ల అనువాదం, నేర్చుకోవడం చాలా సులభమవుతుంది. మనది అద్భుతమైన భాష.. దీన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది'' అని అన్నారు.

**విచారణ తీరు కక్షిదారుడికి తప్పనిసరిగా తెలియాలి: జస్టిస్ కె.లక్ష్మణ్**

తెలుగు అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు జస్టిస్ కె.లక్ష్మణ్ తెలిపారు. మాతృభాషలో భావ వ్యక్తీకరణ చాలా స్పష్టంగా ఉంటుందన్నారు. ''కింది కోర్టు వ్యవహారాలు మాతృభాషలో జరుపుకోవచ్చని ఆదేశాలున్నాయి. మాతృభాష ఉండాలని కొన్ని రాష్ట్రాలు సుప్రీంకోర్టును కోరాయి. తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రం ఒక్క ప్రతిపాదన వెళ్లలేదు. హైకోర్టు వ్యవహారాలు తెలుగులోనే ఉండాలనే దానిపై చర్చ జరగాలి. కోర్టుల్లో జరిగేది 99 శాతం మందికి అర్థం కావడం లేదని సీజేఐనే చెప్పారు. తెలుగులో వాదనలు వినిపించేందుకు హైకోర్టుల్లో నిషేధం లేదు. భాష లేకపోతే పదానికి తేజస్సు ఉండదని మహనీయులు చెప్పారు. పదకోశం సరిగా లేక తెలుగులో తీర్పులు ఇచ్చేందుకు సమస్యలు వస్తున్నాయి. మాతృభాషలో తీర్పులు ఇస్తేనే కక్షిదారులకు అవగాహన వస్తుంది. తెలంగాణ హైకోర్టులో 1,100 తీర్పులను అనువదించాం. ఏపీ హైకోర్టులో 547 తీర్పులను అనువదించారు. తెలుగులో 'లా' చదివితే న్యాయపాలన సమర్థంగా ఉంటుంది. కోర్టులో విచారణ జరిగిన తీరు కక్షిదారుడికి తప్పనిసరిగా తెలియాలి. ఎందుకు ఓడామో.. ఎందుకు గెలిచామో వారికి తెలియాలి. తెలుగులో న్యాయపాలన అమలుకు సూచనలు ఇవ్వాలి. సలహాలు, సూచనలపై చర్చించి సరైన చర్యలు తీసుకుంటాం''అని జస్టిస్ కె.లక్ష్మణ్ తెలిపారు.

**కోర్టు వ్యవహారాలు అందరికీ అర్థం కావాలి: జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి**

**విజయవాడ:** తెలుగులో చదువుకుంటే ఉద్యోగాలు రావని భయపడాల్సిన అవసరం లేదని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి అన్నారు. తెలుగులో చదువుకుని ఎందరో ఉన్నత స్థానాలకు వెళ్లారని.. తాము కూడా మాతృభాషలోనే చదువుకున్నామని చెప్పారు. వృత్తిరీత్యా ఆంగ్లం నేర్చుకున్నామన్నారు. విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల రెండో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరుకూరి రామోజీరావు సభావేదికపై 'తెలుగులో న్యాయపాలన' అంశంపై నిర్వహించిన సదస్సులో జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి మాట్లాడారు. ''మేమంతా తెలుగులోనే చదువుకున్నాం. వృత్తిరీత్యా ఆంగ్లం నేర్చుకున్నాం. కొందరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పులు ఇవ్వడం సంతోషకరం. న్యాయాధికారి కొరిశపాటి బాలకృష్ణారెడ్డి మాటలను గుర్తుచేసుకుందాం. 'తేటతెలుగుతో న్యాయస్థానాన్ని నింపేద్దాం' అని ఆయన అన్నారు. మన కక్షిదారులు, ముద్దాయిలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు అందరికీ తెలుగు వచ్చు. ప్రజల కోసం పనిచేయాల్సిన సేవా సంస్థ.. న్యాయ వ్యవస్థ. రాష్ట్రంలో 99.99శాతం మందికి తెలుగు వచ్చు. కోర్టుల్లో వాద, ప్రతివాదాలు వచ్చీరాని ఆంగ్లంలోనే కొనసాగుతాయి. మన చట్టాలు కూడా ఆంగ్లంలోనే ఉన్నాయి. కోర్టు వ్యవహారాలు అందరికీ అర్థం కావాలి. కేసులు, విచారణల గురించి కోర్టుకు వచ్చిన వారికి తెలియాలి''అని జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి అన్నారు.

## తెలుగులో తీర్పులు ఇస్తేనే సులువుగా అర్థమవుతాయి

**జస్టిస్ కె.మన్మథరావు**



**విజయవాడ:** తెలుగు భాష అమల్లో లోపాలను సరిదిద్దుకుని ముందుకెళ్దామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. అమ్మభాషను మాట్లాడదాం.. ఆత్మాభిమానం చాటుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో భాగంగా నిర్వహించిన 'తెలుగులో న్యాయపాలన' సదస్సులో జస్టిస్ కె.మన్మథరావు మాట్లాడారు. ''తెలుగులో తీర్పు రాశాను అనే విషయంలో ఆనందంగా ఉంది. న్యాయమూర్తి అయ్యాక ఎక్కడికి వెళ్లినా మాతృభాషలోనే మాట్లాడాను. తెలుగులో తీర్పులు ఇస్తేనే ప్రజలకు సులువుగా అర్థమవుతుంది. తెలుగులో తీర్పు ఇచ్చినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఆంగ్లంలో ఉన్న తీర్పును తెలుగులోకి మార్చి తీర్పు ఇచ్చా. ఈ తీర్పుల వల్ల అప్పీళ్లకు వెళ్లడం తగ్గుతుందని భావిస్తున్నా. తీర్పు తెలుగులో ఉంటే మరింత పారదర్శకత ఉంటుంది ''అని జస్టిస్ కె.మన్మథరావు అన్నారు.

## తెలుగులో తీర్పులు.. ప్రత్యేక పదాలు అవసరం: మండలి బుద్ధ ప్రసాద్



తెలుగులో తీర్పులు ఇవ్వడం సులభం కాదని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఇందుకోసం ప్రత్యేక పదాలు అవసరమని చెప్పారు. నిఘంటువులు చూసి చాలా పదాలు రాయాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల రెండో రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తెలుగులో తీర్పుల కోసం అనేక చర్యలు చేపట్టినట్లు బుద్ధ ప్రసాద్ గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో విభజన వివాదం వల్ల కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. జిల్లా కోర్టుల్లో స్థానిక భాషల్లో తీర్పులు ఇవ్వవచ్చని అభిప్రాయపడ్డారు. బ్రిటిష్ హయాంలో తెలుగులో, నిజాం కాలంలో ఉర్దూలో తీర్పులు వచ్చాయని గుర్తుచేశారు. కొన్ని తెలుగు తీర్పులను హైదరాబాద్‌లో ప్రదర్శనకు పెట్టారని చెప్పారు. సీపీ బ్రౌన్ తీర్పులు కూడా తెలుగులో ఉన్నాయని పేర్కొన్నారు. ''అన్ని జిల్లా కోర్టుల్లో తెలుగులో న్యాయపాలన జరపాలని 1974లోనే కేంద్రం ఆదేశాలిచ్చింది. కృష్ణా జిల్లాలో బ్రిటిష్ వారి హయాంలో అప్పటి న్యాయమూర్తి సీపీ బ్రౌన్ తెలుగు నేర్చుకుని తీర్పులన్నీ తెలుగులో ఇచ్చారు. హైకోర్టులో పూర్తిగా తెలుగులో న్యాయపాలన ఊహించలేం. సీఎం కార్యాలయంలో వ్యవహారాలు తెలుగులో జరగాలని గతంలో కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తెలుగులో న్యాయపాలనపై సదస్సు ఏర్పాటు చేసి ప్రయత్నాలు చేశాం. ఇటీవల కాలంలో హైకోర్టులో తెలుగు భాషలో పలు తీర్పులనివ్వడం అభినందనీయం'' అని మండలి బుద్ధ ప్రసాద్ చెప్పారు.



## నా పిల్లలకు పెద్ద బాలశిక్ష చదివిస్తున్నా: మంత్రి సత్యకుమార్

విజయవాడ: అనుకరించడం ద్వారా పిల్లలు భాషను నేర్చుకుంటారని ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మాతృభాషతో మమేకమైతే తెలివితేటలు పెరుగుతాయన్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో ఆయన మాట్లాడారు. మాతృభాష నేర్చుకున్న పిల్లల్లో సృజనాత్మకత ఎక్కువగా ఉంటుందన్నారు. ''నా మాతృభాష మరాఠీ అయినా.. తెలుగులోనే చదువుకున్నాను. నా పిల్లలకు పెద్ద బాలశిక్ష ఇచ్చి చదవమంటున్నా. సంస్కృతి, వారసత్వం, పండుగలు అన్నీ భాషతోనే ముడిపడి ఉంటాయి. తల్లిదండ్రుల చొరవతోనే మాతృభాష మనుగడ సాధ్యపడుతుంది. మన తెలుగుభాష ఎప్పటికీ నిలిచి ఉంటుంది. మైసూరులో తెలుగు భాష అధ్యయన కేంద్రం ఉండేది. 2020లో ఏపీకి తీసుకొని వచ్చారు. కానీ, భవనం కేటాయించడానికి వైసీపీ ప్రభుత్వం కృషిచేయలేదు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆయన ట్రస్టుకు చెందిన ఓ భవనాన్ని ఇచ్చారు. ప్రాచీన తెలుగు భాష అధ్యయన కేంద్రానికి కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. త్వరలోనే సొంతభవనం అందుబాటులోకి వస్తుంది. భాషాభివృద్ధి ప్రభుత్వం చేతిలో ఉంటుంది. గత ఐదేళ్లలో తెలుగులో విద్యాబోధనపై నిర్లక్ష్యం ప్రదర్శించారు. తెలుగులో చదివితే ఉద్యోగం రాదు అన్న భావన పెరిగింది. ఆంగ్ల భాషపై మక్కువ పెంచే ప్రయత్నం చేశారు'' అని సత్యకుమార్ యాదవ్ అన్నారు.

## సహజ సిద్ధంగా వచ్చేదే మాతృభాష: జేడీ లక్ష్మీనారాయణ



పిల్లలకు మాతృభాషలో కాకుండా ఇతర భాషల్లో బోధన చేయడం దుర్మార్గం అని విశ్రాంత పోలీసు అధికారి జేడీ లక్ష్మీ నారాయణ అన్నారు. సహజ సిద్ధంగా వచ్చేదే మాతృభాష, అమ్మ అనే మాటలో ఉన్న మాధుర్యం.. మమ్మీ అనే మాటలో ఉండదని పేర్కొన్నారు. '' భాష అభివృద్ధిలో రాజకీయ నాయకుల పాత్ర చాలా ముఖ్యమైంది. భాషపై సమాజం ఎంత ఆధారపడింది అన్నదాన్ని బట్టి భాష ప్రాధాన్యత, గొప్పదనం తెలుస్తుంది. కృత్రిమ భాషతో పిల్లలకు విద్యాబోధనలు చేయడం వారి వ్యక్తిత్వాన్ని హరించడమే అవుతుంది. ఐదో తరగతి వరకు మాతృభాషలో బోధించాలని జాతీయ విద్యా విధానంలో స్పష్టంగా చెప్పారు.పదోతరగతి వరకు తెలుగు తప్పనిసరిగా ఉంచేలా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. పాఠ్యాంశాల్లో ఏయే అంశాలు ఉండాలో ప్రభుత్వం చర్చించి తగిన చర్యలు తీసుకోవాలి. మాతృభాషను నేర్చుకుంటే ఇతర భాషల్లో సులభంగా ప్రావీణ్యం సంపాదించవచ్చు. కాటుకను కళ్లకు పెట్టుకుంటే అందం.. అలాగని ఒళ్లంతా పులుముకుంటే నల్లబడి పోతారు.. ఇంగ్లీష్ కూడా అంతే '' అని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

## మాతృభాషను ఆప్షనల్ సబ్జెక్టుగా చేయొద్దు: జస్టిస్ బి.కృష్ణమోహన్



ప్రతి ఒక్కరూ తెలుగు భాష మాధుర్యాన్ని అనుభవించాలని జస్టిస్ బి. కృష్ణమోహన్ అన్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు భాషలోని లెస్సదనాన్ని తెలియజెప్పాలని.. మన కవులు, వాగ్గేయకారుల గురించి తెలియజేయాలని కోరారు. ''మాతృభాషను కేవలం వాడుక భాషగానే పరిగణించడం సరైంది కాదు. పిల్లలకు తల్లిదండ్రులు మాతృభాష అందిస్తేనే భవిష్యత్తులో తెలుగు చూడగలం.. వినగలం. ఎందరో మహానుభావులు తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేశారు. పాఠశాలల్లో మాతృభాషను ఆప్షనల్ సబ్జెక్టుగా చేయొద్దు. పదో తరగతి వరకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలి. హైకోర్టులో మాతృభాష ఎక్కువగా అమలు చేయడంపై చాలా విధాలుగా ఆలోచన చేస్తున్నాం. ఆంగ్లంతో సమానంగా తెలుగులో అర్థం వచ్చేలా కచ్చితమైన పర్యాయపదాల సృష్టిపై కృషి చేస్తున్నాం. గతంలో కోర్టుల్లో అనువాదకుల పోస్టులుండగా తీసేశారు. తెలుగు అమలు కోసం ఆ పోస్టులను తిరిగి తీసుకురావాల్సిన అవసరముంది. కృత్రిమ మేధను వినియోగించుకుని కోర్టుల్లో డిజిటలైజేషన్, ఆధునీకీకరణ చేస్తున్నాం. న్యాయస్థానాల్లో తెలుగు వ్యవహారాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం'' అని జస్టిస్ బి. కృష్ణమోహన్ అన్నారు.



## ఉత్కంఠ పోరులో సఫారీలదే గెలుపు..

### డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దక్షిణాఫ్రికా

**సెంచూరియన్:** పాకిస్థాన్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో సఫారీలు తొలిసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించారు. 148 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్ నైట్ స్కోరు 27/3తో నాలుగో రోజు (ఆదివారం) ఆటను ప్రారంభించిన దక్షిణాఫ్రికా.. మార్‌క్రమ్ (37; 63 బంతుల్లో), తెంబా బావుమా (40; 78 బంతుల్లో) రాణించడంతో సునాయసంగా విజయం సాధించేలా కనిపించింది. ఒక దశలో 93/4 స్కోరుతో మెరుగైన స్థితిలో ఉన్న సఫారీల జట్టు.. కాసేపటికే 12 బంతుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయింది. దీంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది.ఈ క్రమంలో టెయిలెండర్ కగిసో రబాడ (31*; 26 బంతుల్లో 5 ఫోర్లు) నికార్సైన బ్యాటర్‌లా మారిపోయి జట్టుకు మరుపురాని విజయాన్ని అందించాడు. మార్కో యాన్సెన్ (16; 24 బంతుల్లో 3 ఫోర్లు) అతడికి సహకరిస్తూ విన్నింగ్ షాట్ కొట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో పాక్ పేసర్ మహ్మద్ అబ్బాస్ (6/54) సత్తాచాటాడు. ఈ మ్యాచ్‌లో విజయం తర్వాత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా (66.67 శాతం) అగ్రస్థానంలో ఉంది. ఆస్ట్రేలియా (58.89) భారత్ (55.88) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. న్యూజిలాండ్ (48.21), శ్రీలంక (45.45) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## గవాస్కర్ కాళ్లు మొక్కిన నితీష్‌రెడ్డి తండ్రి..

**హైదరాబాద్:** భారత యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్టులో 8వ స్థానంలో వచ్చి అద్భుతమైన సెంచరీ చేయడంతో ఆయన తండ్రి ముత్యాల రెడ్డి ఎంతో ఎమోషనల్ అయ్యారు. మ్యాచ్ అనంతరం నితీష్ తండ్రి ముత్యాలరెడ్డి సునీల్ గవాస్కర్ కాళ్లు మొక్కారు. ఆ తర్వాత నితీష్ రెడ్డి సోదరి కూడా గవాస్కర్ పాదాలకు నమస్కరించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

మెల్‌బోర్న్ టెస్టు మూడో రోజు ఆట ముగిసిన అనంతరం నితీష్ కుమార్ రెడ్డి కుటుంబం గవాస్కర్‌తో సమావేశమైంది. ఈ సమావేశంలో నితీష్ తండ్రి భావోద్వేగానికిలోనయ్యారు. గవాస్కర్ కనిపించగానే ఆయనను ఆలింగనం చేసుకోవడానికి ముందు కాళ్లపై పడ్డారు. మోకాళ్లపై కూర్చుని కాళ్లు మొక్కారు. అదేవిధంగా తన కుమారుడిపై ప్రశంసలు కురిపించిన మాజీ ఆటగాళ్లు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో సునీల్ గవాస్కర్.. నితీష్ కుమార్ రెడ్డి గురించి, అతని బ్యాటింగ్ గురించి మాట్లాడారు. ఆతనో వజ్రమని కితాబిచ్చాడు. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 8వ స్థానంలో క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి.. 189 బంతులు ఎదుర్కొని 114 పరుగులు చేశాడు. దాంతో ఇన్నింగ్స్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. నితీష్ ఆటను టెస్టు చరిత్రలోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా క్రికెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.తాజా ఇన్నింగ్స్‌తో భారత టెస్టు చరిత్రలో 8వ నంబర్ బ్యాట్స్‌మెన్‌గా బరిలో దిగి రెండో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నితీష్ నిలిచాడు. అంతకుముందు 2002లో వెస్టిండీస్‌పై అజయ్ రాత్రా అజేయంగా 115 పరుగులు చేశాడు. కాగా మెల్‌బోర్న్‌లో సాధించిన సెంచరీని నితీష్ కుమార్ రెడ్డి తన తండ్రికి అంకితమిచ్చాడు.



# పట్టుదలతో ఆడిన టెయిలెండర్లు నాథన్-బోలాండ్

- ఆసక్తికరంగా మారిన నాలుగో టెస్టు
- నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 228/9
- భారత్ గెలిస్తే 96 ఏళ్ల రికార్డు కనుమరుగు!





**మెల్‌బోర్న్:** మెల్‌బోర్న్ వేదికగా బాక్సింగ్ డే టెస్టు ఆసక్తికరంగా మారింది.42/1 నుంచి 91/6కి పడిపోయిన జట్టు.. ఆలౌటైపోయి ఉండాలి. ఆఖర్లో పట్టువదలడమనే అలవాటున్న భారత్ మరోసారి తన బలహీనతను బయట పెట్టుకుంది. బౌలర్లు శ్రమించినా.. ఫీల్డర్లు క్యాచ్‌లను వదిలేయడంతోపాటు అదృష్టం ఆసీస్ పక్షాన నిలిచింది. నాలుగో రోజు ఆట ముగిసేసరికి ఆస్ట్రేలియా 9 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. క్రీజ్‌లో నాథన్ లైయన్ (41*), స్కాట్ బోలాండ్ (10*) ఉన్నారు. వీరిద్దరూ పదో వికెట్‌కు 55 పరుగులను జోడించారు. భారత బౌలర్ల దెబ్బకు కుదేలైన తమ ఇన్నింగ్స్‌కు వీరిద్దరూ ఊపిరి పోశారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఆధిక్యం 333 పరుగులకు చేరింది. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 4, సిరాజ్ 3, జడేజా ఒక వికెట్ తీశారు.

యువ ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేసి ఆసీస్ వికెట్ల పతనానికి బుమ్రా శ్రీకారం చుట్టాడు. సిరాజ్ కూడా సత్తా చాటడంతో ఉస్మాన్ ఖవాజా (21), స్టీవ్ స్మిత్ (13) పెవిలియన్‌కు చేరారు. ఒకవైపు మాగ్నస్ లబుషేన్ (70) క్రీజ్‌లో పాతుకుపోయాడు. అయితే, స్వల్ప వ్యవధిలో ట్రావిస్ హెడ్ (1), మిచెల్ మార్ష్ (0), అలెక్స్ కేరీ (2)ను బుమ్రా ఔట్ చేశాడు. అయితే, లబుషేన్‌తో కలిసిన కెప్టెన్ పాట్ కమిన్స్ (41) ఏడో వికెట్‌కు 57 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో వీరిద్దరూ ఇచ్చిన క్యాచ్‌లను యశస్వి జైస్వాల్ వదిలేయడం గమనార్హం. లబుషేన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరింత ప్రమాదకరంగా మారుతున్న అతడిని సిరాజ్ ఎల్బీ చేసి బ్రేక్ ఇచ్చాడు. మిచెల్ స్టార్క్ (5) రనౌట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు.

ఇక ఆసీస్ ఇన్నింగ్స్ ముగియడం పెద్ద సమస్య కాదని అంతా భావించారు. కానీ, నాథన్‌బోలాండ్ పట్టుదల ప్రదర్శించారు. వికెట్ ఇవ్వకుండా భారత బౌలర్లను విసిగించారు. కొత్త బంతి తీసుకున్నాక బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా ఐదో వికెట్ తీసే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. లైయన్ ఆడిన బంతి స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ వద్దకు వెళ్లింది. ఎలాగోలా పట్టిన కేఎల్ ఔట్ అంటూ అరిచాడు. కానీ, ఆ బంతి నోబాల్ కావడంతో భారత అభిమానులు నిరాశకు గురయ్యారు. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా నాలుగు నో బాల్స్ వేశాడు. ఇప్పుడు వికెట్ మిస్ కావడంతో 'నో బాల్స్'పై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

మెల్‌బోర్న్ టెస్టు.. భారత్ గెలిస్తే 96 ఏళ్ల రికార్డు కనుమరుగు!..

బాక్సింగ్ డే టెస్టులో టీమ్‌ఇండియాకు భారీ లక్ష్యమే ఎదురైంది. సోమవారం ఆటకు చివరి రోజు. ఆట కూడా షెడ్యూల్ కంటే అర్ధ గంట ముందే ప్రారంభం కానుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 4.30 గంటలకు మొదలవుతుంది. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే దాదాపు 96 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఓ రికార్డు తుడిచిపెట్టుకుపోనుంది. ఇంతకీ అదేంటంటే? మెల్‌బోర్న్ మైదానం వేదికగా జరిగిన టెస్టులో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ఇంగ్లండ్ కొనసాగుతోంది. ఆసీస్‌పై 1928లో 332 పరుగులను ఛేదించి ఇంగ్లండ్ విజయం సాధించింది. ఇప్పుడు భారత్ గెలిస్తే ఆ రికార్డును అధిగమించే అవకాశం ఉంది. టీమ్‌ఇండియా ఇక్కడ ఆడిన గత రెండు టెస్టుల్లోనూ విజయం సాధించడం సానుకూలాంశం. ఇప్పుడు కూడా టాప్ ఆర్డర్ రాణిస్తే లక్ష్య ఛేదన పెద్ద కష్టం కాబోదనేది క్రికెట్ వర్గాల విశ్లేషణ.

గతంలో ఇలా..

భారత్ చివరిసారిగా(2021 సీజన్) మెల్‌బోర్న్‌లో అజింక్య రహానె నాయకత్వంలో ఆసీస్‌తో తలపడింది. ఆ మ్యాచ్‌లో రహానె సెంచరీ సాధించాడు. బుమ్రా 6, సిరాజ్ 5, అశ్విన్ 5 వికెట్లు తీసి ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. 70 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది.

ఇక 2018/19 సీజన్‌లో కోహ్లీ సారథ్యంలో భారత్ అద్భుత విజయం నమోదు చేసింది. పుజారా (116), కోహ్లీ (82) బ్యాటింగ్‌లో రాణించారు. బుమ్రా 9 వికెట్లు తీసి ఆసీస్‌ను దెబ్బకొట్టాడు. ఆ మ్యాచ్‌లో భారత్ 137 పరుగుల తేడాతో గెలిచింది.

## చెస్ బోర్డుపై భారత 'క్వీన్'..
# హంపీపై ఆనంద్ మహీంద్రా ప్రశంసలు



**ముంబయి:** ఎన్నో ఆసక్తికర విషయాలు, ప్రేరణ కలిగించే వీడియోలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటుంటారు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా . తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక 'భారత రాణి' చెస్ బోర్డును శాసించారు. కోనేరు హంపి తన అద్భుతమైన ఆట తీరుతో మమ్మల్ని ఎంతో గర్వించేలా చేశారు. భారత చెస్‌కు అద్భుతమైన సంవత్సరంగా నిలిచిన ఈ ఏడాదికి విజయవంతమైన ముగింపును అందించినందుకు కృతజ్ఞతలు!" అంటూ మహీంద్రా సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపించారు.

తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అద్భుతమైన ఘనత సాధించింది. ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలిచింది. టోర్నీలో 8.5 పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లి విజయం సాధించింది. 2019లోనూ హంపి ఛాంపియన్ అయింది. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెంజున్ తర్వాత ఒకటి కంటే ఎక్కువసార్లు విజేతగా నిలిచిన ప్లేయర్‌గా హంపి ఘనత సాధించింది. మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఐదో స్థానంలో నిలిచింది.

గెలుపొందిన అనంతరం కోనేరు హంపి మాట్లాడుతూ ఆనందం వ్యక్తం చేశారు. "చాలా సంతోషంగా ఉంది.

నిజానికి, ఇది టైబ్రేక్ వంటి చాలా కఠినమైన రోజు అని అనుకున్నాను. ఆట పూర్తయిన క్షణంలో భావోద్వేగానికి లోనయ్యాను. మొదటి రౌండ్‌లో ఓటమి తర్వాత నాకు టైటిల్ వస్తుందని అస్సలు అనుకోలేదు. అయితే.. వరుసగా నాలుగు గేమ్‌లను గెలవడం చాలా సహాయపడింది. నా గెలుపు, ప్రపంచ ఛాంపియన్‌గా గుకేష్ విజయం భారతీయులను చెస్ వైపు ప్రోత్సహిత్సాయని అనుకుంటున్నాను'' అని ఆమె అన్నారు. యువత చెస్‌ను తమ ప్రొఫెషన్‌గా తీసుకోవాలని కోరారు.

చెస్‌లో దూసుకుపోతున్న భారత్

సెప్టెంబర్‌లో బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో ఓపెన్, మహిళల విభాగాల్లో భారత్ తొలిసారిగా బంగారు పతకాలు సాధించింది. ఇటీవల తమిళనాడుకు చెందిన దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో జరిగిన తుది పోరులో విజేతగా నిలిచాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన అతిపిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డు సృష్టించాడు. కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌ను రెండోసారి సొంతం చేసుకుంది.



## వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్.. విజేతగా నిలిచిన కోనేరు హంపి

**హైదరాబాద్:** తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అద్భుతమైన ఘనత సాధించింది. ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ర్యాపిడ్ ఛాంపియన్‌గా కోనేరు హంపి నిలిచింది. టోర్నీలో 8.5 పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లి విజయం సాధించింది. 2019లోనూ హంపి ఛాంపియన్ అయింది. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెంజున్ తర్వాత ఒకటి కంటే ఎక్కువసార్లు విజేతగా నిలిచిన ప్లేయర్‌గా హంపి ఘనత సాధించింది. మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఐదో స్థానంలో నిలిచింది.

పురుషుల విభాగంలో..

తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి అగ్రస్థానంలో ఉన్న భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి చివర్లలో వెనుకబడిపోయాడు. పురుషుల ర్యాపిడ్ ఈవెంట్‌లో 18 ఏళ్ల వోలాదర్ ముర్జిన్ విజేతగా నిలిచాడు. రష్యాకు చెందిన ఈ యువ గ్రాండ్ మాస్టర్ 10 పాయిట్లు సాధించి ఛాంపియన్‌గా అవతరించాడు. అర్జున్ (9 పాయింట్లు) ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

2024.. మన దేశ చెస్ క్రీడాకారులకు మరిచిపోలేని సంవత్సరం: సీఎం చంద్రబాబు

కోనేరు హంపి విజయం దేశానికే గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ హంపికి అభినందనలు తెలిపారు. 2024.. మన దేశ చెస్ క్రీడాకారులకు మరిచిపోలేని సంవత్సరమని పేర్కొన్నారు.

అసాధారణమైన పట్టుదల, సంకల్పం, నైపుణ్యం హంపి సొంతమని ఏపీ మంత్రి లోకేశ్ తెలిపారు. ఆమె మరిన్ని విజయాలు సాధించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

## మూడు క్యాచ్‌లు డ్రాప్: జైస్వాల్‌పై రోహిత్ అసంతృప్తి..!

**మెల్‌బోర్న్:** క్రికెట్‌లో క్యాచ్‌లు మ్యాచ్ ఫలితాలను శాసిస్తాయి. ఈ విషయం పొట్టి ప్రపంచకప్ ఫైనల్స్‌లో సూర్యకుమార్ యాదవ్ ప్రపంచానికి చూపాడు. ఈ విషయాన్ని భారత యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ మర్చిపోయినట్లు ఉన్నాడు. ఏకంగా మూడు క్యాచ్‌లను డ్రాప్ చేసి కెప్టెన్ ఆగ్రహానికి గురయ్యాడు.

ఆసీస్ రెండో ఇన్నింగ్స్ మొదలైన తర్వాత ఉస్మాన్ ఖవాజా కోసం గల్లీలో జైస్వాల్‌ను ఫీల్డింగ్‌కు పెట్టారు. బుమ్రా వేసిన బంతిని ఖవాజా ఫ్లిక్ చేసి అటువైపు కొట్టాడు. కానీ, జైస్వాల్ మాత్రం క్యాచ్‌ను నేలపాలు చేశాడు. అప్పటికి ఆసీస్ ఇన్నింగ్స్ మొదలై మూడు ఓవర్లే అయింది. ఆ క్యాచ్ డ్రాప్‌ను చూసి బుమ్రా అవాక్కయ్యాడు.ఇక 40వ ఓవర్లో ఆకాశ్‌దీప్ వేసిన లెంగ్త్ బాల్‌ను లబుషేన్ బ్యాట్ ఫేస్‌ను ఓపెన్ చేసి ఆడేందుకు యత్నించగా గల్లీలోని జైస్వాల్ దిశగా వెళ్లగా.. మళ్లీ చేజార్చాడు. అప్పటికి అతడు అర్ధ శతకం కూడా పూర్తి చేయలేదు. మ్యాచ్‌లో అతడు 70 పరుగులు చేశాడు. ఇక ఆసీస్ కెప్టెన్ కమిన్స్ 20 పరుగుల వద్ద ఉండగా సిల్లీ పాయింట్‌లో ఇచ్చిన క్యాచ్‌ను కూడా చేజార్చాడు. వాస్తవానికి లబుషేన్ క్యాచ్ వదిలిన సమయంలోనే జైస్వాల్‌పై రోహిత్ అసహనం వ్యక్తం చేశాడు.

ఇక తొలి ఇన్నింగ్స్‌లో కూడా సిల్లీపాయింట్లో ఫీల్డింగ్‌కు వచ్చిన జైస్వాల్ బ్యాటర్ స్మిత్ బంతిని కొట్టక ముందే గాల్లోకి ఎగరడాన్ని రోహిత్ గమనించాడు. "అరే జస్సూ.. గల్లీ క్రికెట్ ఆడుతున్నావా ఏంటీ..? బాల్ ఆడేదాకా కిందే ఉండు..'' అంటూ సీరియస్‌గా రోహిత్ చెప్పాల్సి వచ్చింది. ఈ మాటలు స్టంప్ మైక్‌లో స్పష్టంగా వినిపించాయి.

మరోవైపు ఫాక్స్ క్రికెట్ వ్యాఖ్యత, ఆసీస్ మాజీ బ్యాటర్ మైక్ హస్సీ స్పందిస్తూ "క్యాచ్‌లను ఎవరూ కావాలని వదిలేయరు. ఇప్పటికే జైస్వాల్ అందుకు సిగ్గుపడుతున్నాడు. ఈ సమయంలో అతడిని ఏమీ అనకుండా మౌనంగా ఉంటూ ప్రోత్సహించాలి. ముఖ్యంగా కెప్టెన్ ఈ పనిచేయాలి. ఎందుకంటే నాయకుడి స్పందన చాలా కీలకం. అది జట్టును ఒత్తిడి నుంచి బయటపడేసేట్లు ఉండాలి కానీ.. ఇంకా అందులోకి నెట్టేట్లు కాదు'' అని జైస్వాల్‌కు మద్దతు ప్రకటించాడు.



# క్రెడిట్ స్కోర్‌ను ఎలా లెక్కిస్తారో తెలుసా?

**విశ్వంభర, బిజినెస్:** రుణం కావాలంటే క్రెడిట్ స్కోర్.. తక్కువ వడ్డీ కావాలంటే క్రెడిట్ స్కోర్.. క్రెడిట్ కార్డు తీసుకోవాలన్నా క్రెడిట్ స్కోరు.. ఇలా ప్రతిదానికీ ఈ స్కోరు నిత్యజీవితంలో కీలకంగా మారింది. ముఖ్యంగా రుణాలు ఇచ్చేటప్పుడు వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణను అంచనా వేయడానికి ఆర్థిక సంస్థలు దీన్ని పరిగణనలోకి తీసుకుంటాయి. అందుకే చాలా మంది ఈ మూడంకెల సంఖ్యను మెరుగు పరుచుకునేందుకు ఆరాటపడుతుంటారు. సాధారణంగా క్రెడిట్ స్కోర్ అనేది 300 నుంచి 900 మధ్య ఉంటుంది. 750+ ఉంటే దాన్ని మెరుగైన క్రెడిట్ స్కోర్‌గా భావిస్తారు. ఇంతకీ ఈ క్రెడిట్ స్కోర్‌ని ఎలా లెక్కిస్తారు? లెక్కించేటప్పుడు ఏ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు?




పేమెంట్ హిస్టరీ..

పేమెంట్ హిస్టరీ అనేది క్రెడిట్ స్కోర్‌లో చాలా కీలకం. ఈఎంఐలు, రుణాలు, క్రెడిట్ కార్డ్ బిల్లుల తిరిగి సకాలంలో చెల్లించారా? లేదా? అనేది ఇందులో తెలిసిపోతుంది. క్రెడిట్ స్కోర్ లెక్కించేటప్పుడు.. క్రెడిట్ బ్యూరోలు ఆలస్యమైన చెల్లింపులు, రుణ బకాయిలు వంటిని పరిగణనలోకి తీసుకుంటాయి. క్రెడిట్ స్కోరు గణనలో పేమెంట్ హిస్టరీ ప్రభావం 30 నుంచి 35 శాతంగా ఉంటుందని చెబుతున్నారు ఆర్థిక నిపుణులు. కాబట్టి మెరుగైన క్రెడిట్ స్కోరు కోసం చెల్లింపులు ఆలస్యం కాకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో

మీకున్న రుణ పరిమితిలో ఎంత మేర వాడుకున్నామో తెలిపేదే క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో (CUR). అధిక సీయూఆర్ రేషియో క్రెడిట్ స్కోర్‌ని తగ్గిస్తుంది. ఎల్లప్పుడూ ఈ రేషియో 30 శాతానికి మించకూడదని నిపుణులు చెబుతుంటారు. ఉదాహరణకు.. మీ క్రెడిట్ కార్డ్ లిమిట్ రూ.లక్ష అనుకుందాం. అందులో మీరు 50 శాతం వినియోగిస్తే మీ సీయూఆర్ 50 శాతంగా ఉంటుంది. సీయూఆర్ రేషియో 30 శాతానికి మించకూడదనుకుంటే.. మీ క్రెడిట్ కార్డ్ వాడకం రూ.30 వేలకు మించకుండా చూసుకోవాలి. క్రెడిట్ స్కోర్‌లో సీయూఆర్ రేషియో ప్రభావం 25 30 శాతం వరకు ఉంటుందనేది గుర్తుంచుకోవాలి.

క్రెడిట్ హిస్టరీ

మీ రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు స్థిరంగా కొనసాగాలంటే.. పాత బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డులను నిర్వహించడమే మంచిది. కొత్త వాటితో స్కోరును వేగంగా పెంచుకోలేం. కాబట్టి, పాత కార్డులను రద్దు చేసుకునే విషయంలో ఆచితూచి వ్యవహరించండి. వినియోగించడం లేదన్న కారణంతో మంచి హిస్టరీ ఉన్న క్రెడిట్ కార్డ్‌ని తీసేస్తే అది క్రెడిట్ హిస్టరీపై ప్రభావం పడుతుంది. దీనివల్ల క్రెడిట్ స్కోర్ తగ్గిపోయే అవకాశం ఉంది. క్రెడిట్ స్కోరులో హిస్టరీ ప్రభావం దాదాపు 15 శాతంగా ఉంటుంది.

ఇవి కూడా..

రుణాల్లో హామీలేనివి, హామీతో కూడిన రుణాలు ఉంటాయి. గృహ, వాహన, బంగారం రుణాలు ఇందుకు ఉదాహరణ. ఈ రెండు తరహా రుణాలున్నప్పుడే స్కోరు పెరిగేందుకు వీలవుతుంది. క్రెడిట్ స్కోర్ లెక్కించేటప్పుడు క్రెడిట్ మిక్స్ ప్రభావం 10 15 శాతం ఉంటుంది. కాబట్టి ఎక్కువ మొత్తంలో క్రెడిట్ కార్డు వినియోగం, వ్యక్తిగత రుణాలవంటి హామీ రహిత అప్పులు తీసుకోవద్దు. కొన్ని హామీతో ఉన్నవీ ఉండాలంటారు నిపుణులు. ఈ రెండు తరహా రుణాలున్నప్పుడే స్కోరు పెరిగేందుకు వీలవుతుంది.

తక్కువ సమయంలో బహుళ రుణాలు కోసం దరఖాస్తు చేసుకోవడం వల్ల క్రెడిట్ స్కోరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. క్రెడిట్ స్కోర్‌లో దీని వెయిటేజ్ దాదాపు 10 శాతంగా ఉంటుంది. కాబట్టి మీ రుణ పరపతిని చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలి. అవసరం లేకపోయినా అప్పులు తీసుకోవడం ఎప్పుడూ సరికాదు.

చివరిగా: తీసుకున్న రుణాలు సరైన సమయంలో చెల్లించడం, క్రెడిట్ కార్డ్‌ని పరిమితికి మించి వాడకుండా ఉండడం వల్ల క్రెడిట్ స్కోర్ పెంచుకోవచ్చు. ఎప్పటికప్పుడు క్రెడిట్ రిపోర్ట్‌ని చెక్ చేసుకోవడం ద్వారా ఎక్కడ తప్పులు చేస్తున్నామో తెలుసుకోవడానికి వీలు పడుతుంది.

## టాప్-10 సంస్థల్లో ఆరింటి ఎం-క్యాప్ రూ.86,848 కోట్ల వృద్ధి..

### రిలయన్స్, హెచ్డీఎఫ్సీ బ్యాంకులకు భారీ లబ్ధి..!

**ముంబయి:** గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లలో టాప్10 సంస్థల్లో ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.86,847.88 కోట్లు పెరిగింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా లబ్ధి పొందాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 30 గతవారం 657.48 పాయింట్లు, ఎన్ఎస్ఈ 50 సూచీ నిఫ్టీ 225.9 పాయింట్ల లాభంతో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐటీసీ, హిందుస్థాన్ యూనీ లివర్ లాభ పడ్డాయి. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,235.95 కోట్లు పుంజుకుని రూ.13,74,945.30 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎంక్యాప్ రూ.20,230.9 కోట్ల లాభంతో రూ.16,52,235.07 కోట్ల వద్ద ముగిసింది. ఐటీసీ ఎంక్యాప్ రూ.17,933.49 కోట్ల లబ్ధితో రూ.5,99,185.81 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎంక్యాప్ రూ.15,254.01 కోట్ల లాభంతో రూ.9,22,703.05 కోట్ల వద్ద ముగిసింది. భారతీ ఎయిర్ టెల్ ఎంక్యాప్ రూ.11,948.24 కోట్లు పెరిగి రూ.9,10,735.22 కోట్లకు చేరుకుంది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎంక్యాప్ రూ.1,245.29 కోట్లు పుంజుకుని రూ.5,49,863.10 కోట్లకు చేరుకుంది.

మరోవైపు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,557.39 కోట్ల నష్టంతో రూ.7,13,567.99 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,412.24 కోట్లు కోల్పోయి రూ.5,61,406.80 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎంక్యాప్ రూ.2,283.75 కోట్ల పతనంతో రూ.7,95,803.15 కోట్ల వద్ద ముగిసింది. టీసీఎస్ ఎంక్యాప్ రూ.36.18 కోట్ల నష్టంతో రూ.15,08,000.79 కోట్ల వద్ద స్థిర పడింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఐటీసీ, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.

## ఒకే వాట్సప్ నంబర్ రెండు ఫోన్లలో..

### ఇలా లింక్ చేసుకోండి!

**విశ్వంభర (బిజినెస్):** వాట్సప్.. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాడే మెసేజింగ్ యాప్. అంతగా మన రోజువారీ జీవితాల్లో భాగమైపోయింది. ఒకప్పుడు ఒక నంబర్‌తో ఒక ఫోన్‌లో మాత్రమే వాట్సప్‌ను వినియోగించుకోవడం సాధ్యమయ్యేది. ఇప్పుడు లింక్డ్ డివైజ్ ఆప్షన్ ద్వారా వేరే ఫోన్లలోనూ అదే నంబర్ వాడుకోవచ్చు. ఇది ఎలా ఉపయోగపడుతుంది? ఇంతకీ ఎలా కనెక్ట్ చేసుకోవాలి?

వ్యాపారానికి సంబంధించి ఒక వాట్సప్ నంబర్ వాడుతున్నప్పుడు వేర్వేరు పని సమయాల్లో వేర్వేరు వ్యక్తులు వాడాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఈ ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది. పొరపాటున ఒక వ్యక్తి తనతో పాటు వాట్సప్ నంబర్ ఉన్న ఫోన్ తీసుకెళ్లినా.. రెండో డివైజ్‌లో వాట్సప్ ద్వారా కార్యకలాపాలు కొనసాగించొచ్చు. అంతేకాదు రెండు ఫోన్లు ఉండేవారు.. ఒక ఫోన్ మాత్రమే బయటకు తీసుకెళ్లాలనుకునే సందర్భంలోనూ ఈ ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది.

**ఎలా లింక్ చేయాలి?**

సాధారణంగా వాట్సప్ వెబ్‌కు మన ఫోన్ కనెక్ట్ చేయడం గురించి చాలా మందికి అవగాహన ఉండే ఉంటుంది. చాలా సింపుల్‌గా ఆ ప్రక్రియను పూర్తి చేయొచ్చు. వేరే ఫోన్‌కు కనెక్ట్ చేయడమనేది కాస్త భిన్నం. ముందుగా మీ ప్రైమరీ ఫోన్‌లో కుడి వైపు ఉండే త్రీ డాట్స్ మెనూను ఓపెన్ చేసి.. అందులో లింక్డ్ డివైజెస్ ఆప్షన్ క్లిక్ చేయాలి.

అప్పుడు క్యూఆర్ కోడ్ స్కానర్ ఓపెన్ అవుతుంది. ఇప్పుడు రెండో ఫోన్ తీసుకుని అందులో వాట్సప్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. లాగిన్ అయ్యే సందర్భంలో ఫోన్ నంబర్ ఆప్షన్ అడుగుతుంది. అప్పుడు త్రీడాట్స్ మెనూ ఓపెన్ చేసి అందులో కంపేనియన్ డివైజ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడో క్యూఆర్ కోడ్ ప్రత్యక్షమవుతుంది. దీంతో ప్రైమరీ ఫోన్‌తో స్కాన్ చేసి లాగిన్ అవ్వాలి. ఆపై రెండు ఫోన్లలోనూ వాట్సప్ వినియోగించుకోవచ్చు.

## తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేతిలోనే..

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్

**ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్**



**విశ్వంభర, హైదరాబాద్:** పిల్లల అల్లరే వారి శక్తిసామర్థ్యాలను బయటపెడుతుందని,ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదిక పై బాలల మహోత్సవం చొక్కాపు వెంకటరమణ ఆధ్వర్యంలో బాలలు మానసిక ఆరోగ్యం పై చర్చా సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలల మానసిక ఆరోగ్యం - దేశ భవిష్యత్తుకు బలమైన మూలస్థంభమన్నారు. దేశ భవిష్యత్తు బాలలపై ఆధారపడి ఉందనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. వికసిస్తున్న సామర్థ్యాల పట్ల తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపిస్తే పిల్లలు ఏదైనా సాధించగలరు అన్నారు. పిల్లల్లో తెలివితేటలు, ఊహాత్మకత అపారంగా ఉంటాయన్నారు. తెలిసిన దాన్ని చురుకుగా, నైపుణ్యంతో చేసి చూపిస్తారన్నారు. మట్టి ముద్దలాంటి చిన్నారి పిల్లలను మాణిక్యాలుగా తీర్చిదిద్దేది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులేనని చెప్పారు.కార్యక్రమంలో దంతవైద్యులు డా.విజయ లక్ష్మీ, సైకాలజిస్ట్ లు డా.వి.జే.ఇ.క్యార్లన్, డా.రమేష్ కుమార్, డా.దీక్షితులు, జయశ్రీ, సుహాసిని, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్‌కు నివాళులు





భారత మాజీ ప్రధాన మంత్రి డా. మన్మోహన్ సింగ్ మరణం యావత్ దేశానికే తీరని లోటు అని ఆర్థిక వేత్తగా, రాజకీయ నేతగ అయినా సేవలు ఎనలేనివాని కాంగ్రెస్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ దివ్యంగుల విభాగం జనరల్ సెక్రటరీ సిహెచ్ పర్వతాలు అన్నాడు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లీ సుందరయ్య పార్క్ చౌరస్థలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్యామ్ యాదవ్, బి ఎల్. వర్మ, భూపాల్, రాములు ముదిరాజ్, విశ్వనాథ్, అమర్,సాంబల్, జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం ఆర్థిక సహాయం



**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ పట్టణ కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ మహ్మద్ అన్వర్ గత మూడు రోజుల క్రితం మరణించారు. ఈ సందర్భంగా వారి అకాల మృతికి చింతిస్తూ ఆదివారం వారి కుటుంబానికి రేషన్ డీలర్ల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. రేషన్ డీలర్ సభ్యులు మాట్లాడుతూ అన్వర్ మరణించటం బాధాకరమని, రేషన్ షాపు ద్వారా ప్రజలకు ఆయన చేసిన సేవలను మర్చిపోలేమన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యం చెపుతూ అన్ని రకాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ మండల అధ్యక్షులు మల్లే సుజాత, మల్లేష్ గౌడ్, సత్యనారాయణ, బిచ్య నాయక్,టిక్ లాల్, జంగయ్య, లక్ష్మయ్య, సుధాకర్ రెడ్డీ,చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు అయ్యప్ప కొండలో మహా పడిపూజ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండమీద వెలసిన అయ్యప్ప స్వామి దేవస్థానంలో మహా పడిపూజ ప్రతి సంవత్సరం డిసెంబర్ 30న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. జిల్లాలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ మహా పడిపూజ చుట్టుపక్కల అయ్యప్ప స్వాములే కాకుండా హైదరాబాదు, ఇతర జిల్లాల నుండి కూడా అయ్యప్ప మాలదారులు విచ్చేసి పూజల్లో పాల్గొంటారు. ఈ సంవత్సరం ఆలయ కమిటీ చైర్మన్ మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి గురుస్వామి ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరానికి చెందిన దేశ్ పాండే గురు స్వామి సోమవారం సాయంత్రం ఏడు గంటల నుండి మహా పడిపూజలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇందుకోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహా పడిపూజ కార్యక్రమంలో స్వాములు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, పాతబస్తీ:** చార్మినార్ నియోజకవర్గం లోని గౌలిపుర చౌరస్తాలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కే జోగేంద్ర సింగ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కే జోగేంద్ర సింగ్ మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే తెలుగుదేశం అని ఎవరి నోట విన్నా కూడా అదే వినిపిస్తుంది. తెలుగుదేశానికి మళ్లీ తేజస్సు, పూర్వ వైభవం వస్తుందని చాలామంది ఈ యొక్క సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పెద్ద ఎత్తున సభ్యత్వాలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ పొలిటిబ్యూరో సభ్యులు బక్కని నరసింహులు సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ యొక్క కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నాగు నాగేష్ హైదరాబాద్ పార్లమెంట్ సెక్రెటరీ బి వై శ్రీకాంత్ సీనియర్ నాయకులు సల్ల రాజ్ కుమార్ , పి రవీంద్ర చారి రాములు, పి శ్రీనివాస్, కే వినోద్ ,అరుణేష్ కాగడ కే నితిన్ అభిషేక్ ,రమేష్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆలయ నిర్మాణానికి 150 సిమెంట్ బస్తాల విరాళం



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన మాణిక్ యాదవ్ జిన్నారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి గుడి నిర్మాణానికి తన వంతు సహకారంగా 150 సిమెంట్ బస్తాలను అందజేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని తమకు తోచిన సహాయం విరాళంగా అందజేయాలని పోచమ్మ తల్లి నూతన దేవాలయాన్ని నిర్మిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీ ఆర్ ఎస్ నాయకులు వెంకటేశం గౌడ్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి నరసింహారెడ్డి మాజీ వార్డ్ మెంబర్ లింగం మల్లేష్ వెంకటేష్ పాల్గొని మాణిక్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** తంగళ్ళపల్లి మండలం చిన్న లింగాపూర్ గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షులు గుర్రం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్రంలోని ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అలాగే రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తూ చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన పయ్యావుల కవితకు 60 వేల రూపాయలు, ఐలాపురం పరశు రాములుకి 30 వేల రూపాయలు, బోడపట్ల నాగలక్ష్మి కి 22500, గుర్రం గోపాల్ కి 10000 రూపాయల చెక్కులను అందజేశారు. ఇట్టి చెక్కులు రావడానికి మాకు సహాయం చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్ కి, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డికి, తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కి చిన్న లింగాపూర్ మాజీ ఎంపీటీసీ బైరివేని రాముకి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ మంద నారాయణ గౌడ్ , శ్రీరాములు వెంకటేష్ , బోలవేణి అనిల్ , మాసిని మధు , రేగుల ఎల్లయ్య , ఇట్లా పరిసరాలు, వంతడుపుల బాలరాజు, గుర్రం యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

**హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు**



**విశ్వంభర, బర్కత్ పుర:** భారత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా. ఎన్. గౌతమ్ రావు అన్నాడు.. బర్కత్ పుర బీజేపీ నగర కార్యాలయంలో ఈ సంవత్సరం చివరి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలతో వీక్షించారు. ఈసందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజల నుండి విశేషమైన స్పందన లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ మన్ కీ బాత్ ద్వారా ప్రముఖ వ్యక్తుల గురించి, దేశంలో ప్రాచీన ప్రదేశాల గురించి దేశంలో జరుగుతున్న అభివృద్ధి గురించి తెలుసుకోవడం జరుగుతుందని అన్నాడు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, నేతలు కృష్ణ గౌడ్, వనం రమేష్, రమేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, శ్యాం రాజ్, నంద కిషోర్, సూర్య ప్రకాష్ సింగ్, ఎక్కాల నందు తదితరులు పాల్గొన్నారు.

## టీ, స్నాక్స్ ఫుడ్ కోర్ట్‌ను సందర్శించిన సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండలం గొల్లుర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ప్రదీప్ గౌడ్ ఈ నెల శుక్రవారం 27 న పెద్ద షాపూర్ తండా, గొల్లూరు ఎక్స్ రోడ్ లో ప్రారంభించిన యమ్మీ సర్కిల్ టీ, స్నాక్స్ ఫుడ్ కోర్ట్ ను మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సందర్శించి ప్రదీప్ గౌడ్ కు శుభాకాంక్షలు చెప్పారు. అనివార్య కారణాల వల్ల ప్రారంభించడానికి రాలేక పోయానని అన్నారు. వారితో పాటు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## ధర్నాను విజయవంతం చేయండి

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ ఇందిరపార్క్ వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రిసోర్స్ పర్సన్ ల మహా ధర్నాను నిర్వాహస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రూప్ సింగ్ అతిథులుగా బీ.ఆర్.టీ.యూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి మారయ్య, కనీస వేతనాల బోర్డ్ మాజీ ఛైర్మన్ నారాయణ, తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. ప్రధాన డిమాండ్ ఆర్.పీ లకు ప్రభుత్వ పరంగా ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి. కనీస వేతనం 26 వేలకు పెంచాలి ఉద్యోగ భద్రత ఆరోగ్య భీమా సౌకర్యాలు కల్పించాలని, 7నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పలు డిమాండ్ లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నా కు ఆర్.పీ లు భారీ ఎత్తున తరలి రావాలని ధర్నా ను విజయ వంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.

## డీజే సౌండ్ న్యూసెన్స్.. పలువురుపై కేసు నమోదు

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్ లోని కాంటినెంట్ ఫామ్ హౌస్ లో డీజే పెట్టి డాన్స్ చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు ఫామ్ హౌస్ చేరుకుని పార్టీ నిర్వహిస్తున్న అవినాష్,డీజే ఓనర్ అరవింద్, డీజే ఆపరేటర్ నవీన్, ఫెరోజ్, కాంటినెంట్ మేనేజర్ సుదీర్, కాంటినెంట్ ఓనర్ ఆకాష్ లపై కేసు నమోదు చేసి డీజే సౌండ్ సిస్టం ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేయటం జరుగుతుందని ఘట్కేసర్ పోలీసులు తెలిపారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ లోని భవానీ ఫామ్ హౌస్ లో పెద్ద శబ్దాలతో మద్యం తాగుతూ, సౌండ్ పెట్టి డాన్స్ చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు ఫామ్ హౌస్ చేరుకుని చూడగా కొంతమది వ్యక్తులు మద్యం తాగుతూ, పెద్ద శబ్దాలతో సౌండ్ పెట్టి డాన్స్ చేస్తూ న్యూసెన్స్ చేస్తునారు అని విచారణలో తెలింది వారు గెట్ టుగెదర్ పార్టీ నిర్వహించుకుంటున్నారు అని, అనుమతి లేకుండా మద్యం తెచ్చుకున్నందుకు ఫామ్ హౌస్ ఓనర్ సహకారంతో పోలీస్ వారు పార్టీ నిర్వహిస్తున్న వికాస్, మేనేజర్ బింగి శ్రీశైలం, ఫామ్ హౌస్ ఓనర్ మహేష్ లపై కేసు నమోదు చేసి మద్యం బాటిల్స్ ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్యవైశ్య సంఘం కొత్త క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర,అంబర్పేట్ :** నల్లకుంట డివిజన్ పద్మ కాలనీలో ఆర్యవైశ్య సంఘం నల్లకుంట వారి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నల్లకుంట ప్రెసిడెంట్ శ్రీనివాసా గుప్త, ప్రధాన కార్యదర్శి గజవాడ అంజన్ గుప్తా ,కోశాధికారి ఉప్పల శివకుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## 'పద్మశాలి సేవ సమాజం ట్రస్ట్' క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ తార్నాక డివిజన్ లాలాపేట్‌లో మార్కండేయ పద్మశాలి సేవ సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సరం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ సమాజ సేవలో పద్మశాలి సమాజం అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని, ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి పాజిటివ్ మార్పులు తీసుకువస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగమ ఫౌండర్ బిల్లా యాదగిరి గారు, వెంకటేశం, వెంకట్ స్వామి, శ్రీహరి, నాగరాజు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి దోకూరి ఆర్థిక సహాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రానికీ చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త పోతుగంటి మైసయ్య అనారోగ్యంతో హైదరాబాద్ లోని అపోలో హాస్పిటల్ లో కడుపునొప్పి బాధతో చికిత్స తీస్కుంటున్నారు. ఈవిషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా చికిత్స నిమిత్తం రూ. 5,000 ల ఆర్థిక సహాయం మైసయ్య భార్యకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, మాజీ ఎంపీటీసీ పెంటయ్య,రామ్మోహన్ రెడ్డి, రమేష్, అంజయ్య, పోతుగంటి రమేష్, జూలపల్లి శ్రీను పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటి పరిధిలోని 3వ వార్డులో క్రికెట్ టోర్నమెంట్ మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడల పట్ల యువకులు ఆసక్తి పెంచుకోవాలని చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రాములు సూచించారు. అనంతరం క్రీడాకారులు ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు అర్పించారు. మాజీ ప్రధాని మన్మో హన్ సింగ్ మరణం భారతదేశానికి తీరని లోటు అని,తన జీవన గమనంలో చరిత్రలో నిలిచిపోయే ఎన్నో విజయ శిఖరాలను అధిరోహించారని,వారి జీవితం భావితరాలకు ఆదర్శమన్నా రు. గ్రామీణ ఉపాధి హామీ పథకం,విద్యా హక్కు చట్టం, ఆధార్ కార్డు వంటి ఎన్నో ప్రతిష్టాత్మకమైన పథకాలకు శ్రీకారం చుట్టిన మహా యోధుడని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రభుత్వ ఉద్యోగులు రమేష్,నిరంజన్,భాస్కర్,రాజ్ కుమార్, కృష్ణ,డాక్టర్ సాయి పవన్, తెనాలి, జైరాంరాజ్, గాంధీ, రఘు, పవన్,సంతోష్, నిర్వాహకులు పిర్య నాయక్, కుమార్ టోర్నమెంట్ ఆర్గనైజర్ సంతోష్, కుమార్, రాజేష్ ఉన్నారు.

## ప్రమాదవశాత్తు ఆటో కింద పడి చిన్నారి మృతి



**విశ్వంభర, తలకొండపల్లి:** ప్రమాదవశాత్తు ఆటో కింద పడి చిన్నారి మృతి చెందిన సంఘటన తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పుష్ప రాజ్ యాదవాసి అతని కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం పడకల్ గ్రామానికి వచ్చి జల్లెల శేఖర్ యాదవ్ దగ్గర పశువుల పెంపకానికి పనిలో చేరారు. ఆదివారం ఉదయం పాల డబ్బాలను ఆటోలో తరలిస్తుండగా పుష్ప రాజ్ కూతురు ప్రియాన్సీ 11 నెలల చిన్నారి ఆడుకుంటూ ఆటో కిందికి వెళ్ళింది. అది గమనించకుండా డ్రైవర్ ఆటోను ముందుకు తీయడంతో పాప ఆటో కింద పడి రక్త గాయాలు అయినాయి వెంటనే పాప కుటుంబ సభ్యులు కడ్తాలోని ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకొని వెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టరు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం చిన్నారి శవాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారి తండ్రి యొక్క ఫిర్యాదు మేరకు చిన్నారి మరణానికి కారకుడైన ఆటో డ్రైవర్ జిన్ కుంట నరేష్ పై కేసు నమోదు

## మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాం రెడ్డిని సన్మానించిన సినీ హీరో



**విశ్వాంభర, పరిగి:** నూతన మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన భూమన్న గారి పరశురాం రెడ్డి ని ఆదివారం పరిగి పట్టణంలో సినీ హీరో విజయ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన వారిని గుర్తించి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పదవులు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రైతుల సంక్షేమానికి కృషి చేయాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాం రెడ్డినీ కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ ఆఫీసర్ కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్ రెడ్డి, ఉటుపల్లి ప్రమోద్ కుమార్ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, శశిధర్ రెడ్డి, మాధవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు. చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** నారాయణపురం గ్రామానికి చెందిన ఎస్కే జానీ భార్య అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని స్ఫూర్తి కళాశాలల ఛైర్మన్ రాపర్తి సురేష్, 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ భిక్షం, లారీ భిక్షం, బీఆర్ఎస్ నాయకులు బొడ్డుపల్లి గాలయ్య, జక్కిడి యాది రెడ్డి,ఉప్పల శీను, చిలివేరు వెంకులు, ఏర్పుల అంజమ్మ, చింతకింది ఉష,ఎడ్ల సత్తయ్య, బొడ్డుపల్లి బిక్షం, ఉప్పల ఆంజనేయులు, రాపర్తి కరుణాకర్, సోమన బోయిన చందు,పేర రమేష్, చిలువేరు శేఖర్, ఓరుగంటి లింగస్వామి, స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకలకు హాజరైన జంగా రాఘవరెడ్డి



**విశ్వంభర, హన్మకొండ జిల్లా :** మడికొండ పద్మశాలి ఫంక్షన్ హాల్ లో ఆదివారం మడికొండ యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు లుమేష్ కూతురు మొదటి పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి హాజరయ్యారు.చిన్నారి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ నిండా నూరేళ్లు పాటు జీవితం తో పాటు సమాజ అభివృద్ధి లో భాగం కావాలని జంగా రాఘవ రెడ్డి చిన్నారిని అశ్వీరదించారు. లుమేష్ దంపతులకు అభినందనలు తెలిపారు.ఛైర్మన్ వెంట మాజీ కార్పొరేటర్, సీనియర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు తోట్ల రాజు, కార్పొరేటర్ కాంటెస్ట్ విజయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, జంగా అభిమానులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ లు పెంచకుండా ఎన్నికలకు వెళితే రాష్ట్రంలో అగ్గిరాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డి గూడెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల లో రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావాల్సిన వాటా బీసీలకు దక్కాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల వాటా బీసీలకు దక్కేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని, దీనికి సంబంధించి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్ష పార్టీలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రాన్ని ఒప్పించాలని ఆయన పేర్కొన్నారు. పిడికెడు శాతం మంది ఉన్న వాళ్లకు పదవులు ఇచ్చి 60 శాతానికి పైగా ఉన్న వాళ్లను అణగదొక్కాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.రాష్ట్రంలో కులగణన సర్వే సంపూర్ణంగా జరగలేదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా



స్పందించి పూర్తిస్థాయిలో కులగణన సర్వే జరిపి బీసీలకు న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీ సంఘం నాయకులు గుండె వెంకటేష్, కే మల్లేశం, వీరమల్ల స్వామి, నర్రి నరసింహ, మర్రి ఎట్టయ్య,లింగస్వామి మహేందర్,తదితరులు పాల్గొన్నారు.

# 300 మందికి ఉచిత మెడికల్ క్యాంప్ సేవలు

**విశ్వంభర, నెల్లికుదురు:** అల్లారు ముద్దుగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించి ప్రయోజకులుగా చేసిన అమ్మానాన్నల కు ప్రేమతో వారి పేరున ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉదంతం మానుకోట జిల్లా నెల్లికుదురు మండలం లో జరిగింది.వివరాల్లోకి వెళితే రత్తిరాం తండాకు చెందిన డా.గుగులోతు జగన్ తన తల్లిదండ్రులు స్వర్గీయ గుగులోతు కౌసల్య లక్ష్మణ్ (జికెఎల్) పేరున వారి జ్ఞాపకార్థం సమాజ సేవ కోసం ఆదివారం రత్తిరాం తండాలో ఫౌండేషన్ స్థాపించారు. ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఎల్.కృష్ణమూర్తి, చైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ డా.పందిరి అంజయ్య, రిహిబిలిటేషన్ ఆఫీసర్ జె.గంగాధర్ రావు,డీఎం అండ్ హెచ్ వో మురళీధర్, ఏఎస్ఐ యాకయ్య, లైసెన్ ఆఫీసర్ వెంకటరావు ప్రభృతులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఫౌండేషన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మాతృమూర్తుల పై మమకారంతో ఫౌండేషన్ ద్వారా జగన్ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జగన్ మాట్లాడుతూ..అమ్మానాన్నల రుణం ఈ విధంగా తీర్చు కొనే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులచే కంటి,



సాధారణ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 300 మంది వైద్య సేవలు పొందారు.కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఉల్లి రమ్య, డా.నరహరి.డా.భాస్కర్ నాయక్,భూక్య వెంకన్న వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు తండావాసులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, పరిగి:** పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం నిరుపేద ఆడ పిల్లలకు వరమన్నారు. ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల లో భాగంగా 500 కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మున్సిపల్ ఛైర్మన్ అశోక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు, డీసీసీ ఉపాధ్యక్షులు లాలూ కృష్ణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లు పరశురాం రెడ్డి, ఆంజనేయులు, వైస్ ఛైర్మన్ అయూబ్, పరిగి పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఏజాజ్, డీసీసీ కార్యదర్శి అక్బర్, రామచందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శశిధర్ రెడ్డి, ఆంజనేయులు, వెంకట్ రాములు,శ్రీనివాస్, వెంకటేష్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి నాటికి రైతుల ఖాతాలో రైతు భరోసా

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి**

**విశ్వంభర, ఎల్బీనగర్:** సంక్రాంతి నాటికి రైతుల ఖాతాలో రైతు భరోసా పైసలు జమ అవుతాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గా క్యారగారి శ్రీధర్ నియమితులు అయిన సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి వారి నివాసంలో మర్యాపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల టైమ్ లో ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. గ్యారెంటీలో మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూతకు . ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్కు అమలులోకి వస్తాయి అని అన్నారు. సంక్రాంతి నాటికి రైతుల ఖాతాలో రైతు భరోసా పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ



డైరెక్టర్ బండి మధుసూదన్ రావు,వెంకటేష్ గౌడ్,జంగయ్య, పవన్, భిక్షపతి,దయాకర్, నర్సింగ్,వినాయ్, భాను,జనార్దన్, విప్లవ రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే కేసు నమోదు

**సీఐ నిరంజన్ రెడ్డి**

**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి సర్కిల్ పరిధిలో గల ప్రతి ఒక్కరికి సీఐ. నిరంజన్ రెడ్డి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే నూతన సంవత్సరాన్ని ప్రతి ఒక్కరు సంబరంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 31 న, నూతన సంవత్సర వేడుకల్ని జరుపుకునే వాళ్లు, చట్టాన్ని అతిక్రమిస్తే, వారిని రౌడీ షిటర్లుగా గుర్తించి కేసులు నమోదు చేస్తామని సిఐ నిరంజన్ రెడ్డి సున్నితంగా హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం తన ఆఫీసులో ఏర్పాటుచేసిన విలేకరుల



సమావేశంలో వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 31 రాత్రి రోడ్లపైన కేకులు కట్ చేయడం, బాణాసంచాలు పేల్చడం చట్టరీత్యా నేరమని ఆయన తెలిపారు. ఒక్కసారి రౌడీ షీటర్లుగా కేసులు నమోదైతే, చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇదిలావుంటే, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు నూతన సంవత్సరాన్ని కుటుంబ సమేతంగా జరుపుకోవాలని సిఐ నిరంజన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రాహింపట్నం ఎస్సైలు కిరణ్ కుమార్, రాజు, అనిల్ పాల్గొన్నారు

# విశ్వకర్మ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్ అంబర్ పేట్ చెన్నారెడ్డి నగర్ ఎస్ వి ఆర్ ఫంక్షన్ హాల్ లో అంబర్పేట్ శ్రీ విశ్వకర్మ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆదివారం ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, పద్మా వెంకటరెడ్డి విశ్వ కర్మ సంఘం నాయకులు తదితరులు.

**- విశ్వంభర, అంబర్ పేట్**



## మైసిగండి మైసమ్మను దర్శించుకున్న మాజీ ఎంపీపీ



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ అమ్మవారిని ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి సోదరి ఆమనగంటి పుష్పాలత నరసింహారెడ్డి ఆదివారం దర్శించుకుని, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సతీష్ కుమార్ రెడ్డి,మౌనిక రెడ్డి వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

## ఎమ్మెల్యే వీరేశం పరామర్శ



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస బాలకిషన్ సతీమణి పూస సుభాషిని ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా..



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో ఇటీవల అకాల మరణం పొందిన నోముల లింగయ్య, నోముల స్వామి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 13,900 ల ఆర్థిక సహాయాన్ని అందచేసి, బాధిత కుటుంబాలకు అండగా నిలబడి, మేమున్నామని మానవత్వాన్ని చాటుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామానికి జాంబవ మహాసేన. ఈ కార్యక్రమంలో నోముల యాదగిరి, తిప్పలపల్లి రవీందర్, నోముల సుదర్శన్, ముత్యాల శివ, వంశీ, కృష్ణ, పర్వతాలు, విష్ణు, నరసింహ, భీమ లింగయ్య, మల్లేష్, చిరంజీవి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలి మృతికి సంతాపం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు మాజీ ఎంపీటీసి మేకల భద్రమ్మ అనారోగ్యంతో మరణించగా, వలిగొండ-రామన్నపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి ఆమె భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆవిడ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతో మండల మహిళా అధ్యక్షురాలు గాదె శోభారాణి, మాజీ ఎంపీటీసీ వనం చంద్రశేఖర్, హర్షిణి, పట్టణ అధ్యక్షులు జమీరోద్దీన్, దుబ్బాక గ్రామశాఖ అధ్యక్షుడు నరసింహ, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## అభయ ఫౌండేషన్ గొడుగుల పంపిణీ



**విశ్వంభర, కల్వకుర్తి:** అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని కూరగాయల మార్కెట్ లో మిర్చి మార్కెట్లో రోడ్డుపైన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు 50 గొడుగులను మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడ్మ సత్యం తో పాటు మాజీ ఛైర్మన్ శ్రీశైలం , మాధవ రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు అభయ ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సాయిధపోరాటానికి స్ఫూర్తి దొడ్డి కొమరయ్య

విగ్రహ ఆవిష్కరణ సభలో నేతలు



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విగ్రహవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన నేతలు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం రావడానికి భూమి, భుక్తి, విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వం ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్,మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, భువనగిరి బీఆర్ఎస్ ఇంచార్జ్ క్యామ మల్లేష్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, కనకల చలమల్ల నరసింహారెడ్డి, నర్రి స్వామి, దోనూరు వీరారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నర్రీ నరసింహ, గొరిగే రాజు సెల్వోజి, నర్రి రామలింగం, ఎట్టయ్య, నారాయణ, వెంకన్న, మల్లయ్య, వెంకటయ్య,ఆంజనేయులు,మల్లేష్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బ్యాంక్ ఛైర్మన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దేశ వస్త్ర పరిశ్రమకు చేనేత కార్మికులు వెన్నముక

- చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి
- చేనేత ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి కృష్ణమూర్తి



**విశ్వంభర, హైదరాబాద్:** మెదక్ జిల్లా తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణస్వీకారం హైదరాబాద్ లో జరిగింది. మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన మహంకాళి కృష్ణమూర్తి మెదక్ జిల్లా చైతన్య ఐక్యవేదిక అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రమకు తగ్గ వేతనం దొరకక ప్రభుత్వ సహకారాలు అందక కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. చేనేత కార్మికుల హక్కుల పోరాటం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందు రాష్ట్ర అధ్యక్షుడు సూచనల మేరకు మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక తరపున తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. మెదక్ జిల్లా చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ గుజ్జరి కనిక రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**విశ్వంభర, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండల కేంద్రం ఇనుగుర్తి జడ్పీహెచ్ఎస్ లో 1980-81 విద్యా సంవత్సరానికి చెందిన 10వ, తరగతి బ్యాచ్ ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, ఉపేందర్ లను పూలమాలలు శాల్వాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గాయత్రి సంస్థల అధినేత వద్దిరాజు దేవేందర్, వాలీబాల్ జాతీయ మాజీ కెప్టెన్ కన్న వెంకటనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ బైరు నరసయ్య గౌడ్, మాజీ సర్పంచి బైరు చిన్న బాలయ్య గౌడ్, పోలోజు వ్యాకరణాచారి, నేలకొండ రవీంద్ర చారి, గుజ్జునూరి బాబురావు, తాల్లపెల్లి వెంకటేశ్వర్లు గౌడ్, బత్తం సోమయ్య, మహబూబ్ రెడ్డి,వాసుదేవేందర్ రెడ్డి,బొబ్బిలి వెంకటరెడ్డి,ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలంలోని పెండ్యాల గ్రామం, హనుమాన్ దేవాలయం దగ్గర జరిపిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గము ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి స్వాములు స్వాగతం పలికి హరిహరపుత్రుడు అయ్యప్పస్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి శాలువ మెమోంటోతో సత్కరించారు. సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వాములు మండలం రోజులు దీక్షలో నియమనిష్ఠలతో ఉండి మాలదరణలో ఉన్న రోజులను పండగలా జరుపుకునే మీకు,అలాగే మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు ఆ అయ్యప్ప కృపాకటాక్షాలతో సుఖశాంతులతో వర్ధిల్లేలా చూడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన బీసీ ఐక్యవేదిక సభ్యులు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను బీసీ ఐక్యవేదిక భద్రాచలం కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనతో పలు విషయాలు చర్చించారు. భద్రాచలం నియోజకవర్గం లో నెలకొని ఉన్న సమస్యల గురించి ఎమ్మెల్సీ తో మాట్లాడారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్సీ మల్లన్న ఎల్లవేళలా మీతో నేనుంటా అని భద్రాచలం బీసీ ఐక్యవేదిక వారికి హామీ ఇచ్చారు. బీసీలందరూ తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేయాలని, పోరాటం చేస్తే సాధించలేనిది ఏదీ లేదంటూ తెలిపారు. ఎమ్మెల్సీ ని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు, బీసీ సంఘం కన్వీనర్ బొలిశెట్టి రంగారావు, కో కన్వీనర్ కడియం రామాచారి, మేకల మల్లు యాదవ్ , కొప్పనాతి శాంతారావు , అనుకోజు నరసింహ చారి , తాళ్ల రవికుమార్, బండారు నాగేశ్వరావు , గండేపల్లి హనుమంతరావు , శ్రీధర సురేష్ కుమార్, చల్లంగి దత్తాత్రేయ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత నేత రాగ్యానాయక్ 23వ వర్ధంతి వేడుకలు



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో దివంగత నేత స్వర్గీయ ధీరావత్ రాగ్యా నాయక్ 23 వ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , డీసీసీ అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ మరియు సీనియర్ నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రాజీవ్ భవన్) నందు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాలినడకన బస్టాండ్ వద్ద రాగ్యా నాయక్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.అనంతరం బస్టాండ్ నందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ గిరిజన నాయకులు దివంగత నేత స్వర్గీయ రాగ్యా నాయక్ వర్ధంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించి వారిని స్మరించుకోవడం చాలా గర్వంగా ఉందని అన్నారు. వారి రాజకీయ ప్రస్థానం ఎంతోమంది రాబోవు తరాలకు ఆదర్శం అని అన్నారు.ఆ మహానేత ఆశీర్వాదాల తోనే ఎన్నికల సమయంలో వారి స్థూపం నుంచి ప్రారంభించిన సేవ్ కాంగ్రెస్ సేవ్ మిర్యాలగూడ కార్యక్రమం విజయవంతం అయ్యి మన విజయానికి ఒక మెట్టుగా మారింది అని అన్నారు. రాగ్యా నాయక్ మన నుంచి భౌతికంగా దూరమై 23 సంవత్సరాలు పూర్తవుతున్నా వారిసిద్ధాంతాలు, వారి కీర్తి ఇంకా మన అందరిలో సజీవంగానే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాగ్యా నాయక్ గారి అభిమానులు మరియు బీఎల్ఆర్ బ్రదర్స్, స్కైలాబ్ నాయక్ పలువురు అభిమానులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తనయుడి పుట్టినరోజు వేడుకలు



**విశ్వంభర, డిండి:** డిండి మండల కేంద్రంలో దేవరకొండ నియోజకవర్గం శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ తనయుడు నేనావత్ అభిలాష్ నాయక్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు స్థానిక రాజీవ్ గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డమీది సాయికుమార్, ఉపాధ్యక్షులు ఎలిమినేటి వెన్నెల, ప్రధాన కార్యదర్శి మీసాల రజనీకాంత్, మండల మైనార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, నాయకులు పోలం లక్ష్మణ్, పోలా వెంకటేష్, సింగజోగి పోశాలు, అవుట మల్లేష్,షేక్ ఉమర్, వావిళ్ళ సలయ్య, మహమ్మద్ ఖయ్యూమ్,బల్మూరి సాయిబాబు, బాదమోని శ్రీనివాస్ గౌడ్, ఎంఎ ఖలీమ్, బుషిపాక బాలయ్య, ఆసిఫ్, దిలీప్, అవేజ్, దిలీప్, బాబా, అనిల్, రఘుమారెడ్డి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం రుద్రారం గ్రామ పరిధిలో గల బస్టాండ్ లో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పటాన్ చేరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం రుద్రారం బస్టాండ్ లో అందాజా 60 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి పటాన్ చేరు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతుడి సంబదికులు ఎవరైనా ఉంటే పటాన్ చేరు పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలనీ పోలీసులు కోరారు.

## బండారి దయానంద్ యాదవ్ కు ఉద్యోగ పతి అవార్డు 2024 ప్రదానం




**విశ్వంభర, బషీర్ బాగ్:** ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీ ఎస్డీఎస్ఎంసీ గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ బండారి దయానంద్ యాదవ్ కు ఉద్యోగపతి అవార్డు 2024 ను తెలంగాణ కౌన్సిల్ ఆఫ్హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఈ.పురుషోత్తం ముఖ్యఅతిథిగా విచ్చేసి శాలువా జ్ఞాపిక పూలమాలతో ఘనంగా సన్మానించారు. ప్రపంచ వ్యాపారవేత్త రతన్ టాటా 86వ జయంతి పురస్కరించుకొని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సరస్వత పరిషత్తులు లో ఏర్పాటు చేసిన ఉత్సవాలను పురస్కరించుకొని ఈ అవార్డును ప్రధానం చేశారు. సమాజంలోని నిరుపేదలకు విద్య కోసం స్కాలర్షిప్లు, నిరుద్యోలకు ఉద్యోగాలు, ఆకలితో ఉన్నవారికి ఆహారం, అందజేసి ఎన్నో సంవత్సరాలు ద్వారా అవార్డులు ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ , తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, డాక్టర్ రవితేజ, ఇట్టా ఉదయశ్రీ , డాక్టర్ దివ్య, శోభా తదితరులు పాల్గొని బండారి దయానంద్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రాగ్యా నాయక్ వర్ధంతి వేడుకలు



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం దివంగత నేత స్వర్గీయ ధీరావత్ రాగ్యానాయక్ 23వ వర్ధంతి వేడుకలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ధనావత్ భాస్కర్ నాయక్ మరియు మండల పార్టీ అధ్యక్షుడు ముడిమల భిక్షారెడ్డి, మాజీ ఎంపీపీ అనుముల శ్రీనివాసరెడ్డి, పలువురు గిరిజన నాయకులు, మండల పార్టీ నాయకులు అభిమానులు రాగ్యానాయక్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనుముల వెంకటరెడ్డి , ఆలంపల్లి జానయ్య , సైదయ్య, బాలు, పాండు నాయక్ , యాదగిరి శ్రీనివాసరెడ్డి, రవి నాయక్ మరియు పలువురు మాజీ సర్పంచులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన పుస్తక ప్రదర్శన



**విశ్వంభర, హైదరాబాద్:** పుస్తకం చదవడం తో పాటు, పిల్లల్ని చదివించాలని పుస్తకాలు చదివితే మనశ్శాంతి ఉంటుంది అని జస్టిస్ రాధారాణి హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం లోని 37 వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగింపు సభ లో అన్నారు. చివరి రోజున తరలివచ్చిన అశేష పుస్తకప్రియులకనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పుస్తకం మనల్ని కొత్త ప్రపంచంలో కి తీసుకెళుతుంది. చిన్నతనంలో నాకు ఎమ్ ఎన్ రాయ్ పుస్తకాలు చదవడం అలవాటైంది. అంతర్జాతీయ స్థాయిలో వీరు ప్రతిభ చూపారు. ప్రపంచంలో అనేక మార్పును పుస్తకాలు తెస్తాయి. నాకు నచ్చిన పుస్తకాలు రైలు బడి నన్ను ప్రభావితం చేసిన పుస్తకం. చిన్నపటి నుంచి చదుతున్న పుస్తకాల్లో ఓల్గా సే గంగా పుస్తకం, ఫౌంటెన్ హెడ్, ఇన్ ఫిడిల్, మాలతీ చందూర్ నన్ను ప్రభావితం చేసిన రచయిత్రి. రామాయణ కల్పవృక్షం, రామాయణ విష వృక్షం ఎంతో నచ్చింది. అలాగే భానుమతి గారి అత్తగారి కథలు పుస్తకం ఎంతో నచ్చాయి.లండన్ లైబ్రరీ లో ఎక్కువ పుస్తకాలు చదివింది కార్ల్ మార్క్స్, ఇంకొకరు అంబేద్కర్. అందుకే వాళు ళ గొప్పవాళ్ళు అయ్యారాన్నారు. పుస్తక ప్రదర్శనకి ఆదివారం పాఠకులు పోటెత్తారు.కార్యక్రమం లో ప్రొఫెసర్ కోదండరాం, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా గాజుల శ్రీను



**విశ్వంభర, ఆమనగల్లు:** తెలంగాణ చేనేత ఐక్యవేదిక నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని హయత్ నగర్ లోని కర్నాటి ధనంజయ ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికులకు, పద్మశాలి కుల బాంధవులకు, నన్ను ఈ పదవికి ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో అణగారిన చేనేత కార్మికులను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడానికి తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

## మాజీ ఎంపీ జగన్నాథంకు పరామర్శ



**విశ్వంభర, ఆమనగల్లు:** నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మంద జగన్నాథ్ ను ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు ,సీనియర్ న్యాయవాది అందే కార్ యాధిలాల్ పరామర్శించారు. ఇటీవల జగన్నాథ్ తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు యాధిలాల్ ఆస్పత్రికి చేరుకొని జగన్నాథ్ ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జగన్నాథ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఆమనగల్లు మాజీ చేనేత సంఘం అధ్యక్షుడు కోట కృష్ణయ్య, రాము గౌడ్ తదితరులు ఉన్నారు.

## జనవరి 19న గట్టు మైసమ్మ జాతర



**విశ్వంభర, ఘట్కేసర్:** జనవరి 19న ఘట్కేసర్ గట్టు మైసమ్మ జాతర నిర్వహించాలని ఘట్కేసర్ మున్సిపల్ పాలకవర్గం ఆదివారం నిర్ణయించారు. ప్రతి ఏటా సంక్రాంతి తర్వాత నిర్వహించే ఈ గట్టు మైసమ్మ జాతర ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, ఎండోమెంట్ ఈవో భాగ్యలక్ష్మి మున్సిపల్ కౌన్సిలర్ మున్సిపల్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పార్టీ జాతీయ అధ్యక్షుడు గిరి యాదవ్ సేవలు మరువలేనివి

డా. అజయ్ కుమార్ యాదవ్



**విశ్వంభర, బషీర్ బాగ్:** ప్రజా పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గిరి యాదవ్ బహుజన సమాజానికి చేసిన సేవలు మరువలేనివని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ప్రజా పార్టీ జాతీయ అధ్యక్షుడు గిరి యాదవ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీ వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని గిరి యాదవ్ సేవలను గుర్తు చేసుకున్నారు.

## రాజ్యాంగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి

– కే.ఆర్ రాజ్ కుమార్



**విశ్వంభర, బషీర్ బాగ్:** భారత రాజ్యాంగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కే.ఆర్ రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం. డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, వెంకట్, శివ, మహేష్ గౌడ్, శ్రీను, రాకేష్, అక్రమ్, శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడి పూజలో గంగాపురం కావ్యా కిషన్ రెడ్డి, అందెల శ్రీరాములు



**విశ్వంభర, మహేశ్వరం :** కందుకూరు మండల్ తిమ్మాపూర్ గ్రామంలో రుద్రపాల రాము ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఇరుముడి పూజ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ కలిసి హాజరై అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కావ్య కిషన్ రెడ్డి మాట్లాడుతూ మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామి వారి కృప తప్పక ఉంటుందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి కందుకూరు మండల్ మాజీ ఎంపీపీ మంద జ్యోతి పాండు బీజేపీ సీనియర్ నాయకులు గంగాపురం అమరేందర్ రెడ్డి, బిక్షపతి, రాజేందర్ రెడ్డి, ఢిల్లీ వెంకటేష్ ముదిరాజ్ బిజెపి, బీజేవైఎం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భార్యా, పిల్లలకు విషమిచ్చి కానిస్టేబుల్ ఆత్మహత్య



**విశ్వంభర, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలకుంట కాలనీలో దారుణం జరిగింది. ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. భార్యా పిల్లలకు విషమిచ్చి కానిస్టేబుల్ పందరి బాలకృష్ణ ఉరి వేసుకున్నాడు. కానిస్టేబుల్ మృతిచెందగా ఆయన భార్యా పిల్లలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సిరిసిల్ల 17వ బెటాలియన్‌కు చెందిన పందరి బాలకృష్ణకు భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కుటుంబంతో సహా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పురుగుల మందు తాగి తర్వాత ఉరివేసుకున్న బాలకృష్ణ మృతిచెందాడు. ఇది గమనించిన స్థానికులు స్పృహ తప్పిపోయిన కానిస్టేబుల్ భార్యా పిల్లలను హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ బాలకృష్ణ పిల్లలు యశ్వంత్ ఆశ్రిత్ కాగా భార్యా, పిల్లలు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు చెప్పారు. ఈ ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాలకృష్ణ వృత్తి రీత్యా సిరిసిల్లలో పని చేస్తున్నప్పటికీ, సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. కానిస్టేబుల్ కుటుంబంతో ఆత్మహత్యాయత్నానికి ఎందుకు పాల్పడ్డారో తెలియరాలేదు. అతని భార్య, పిల్లలు స్పృహలోకి వచ్చి చెబితే వివరాలు తెలిసే అవకాశముంది. ఘటనపై సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా మహా పడి పూజ



**విశ్వంభర, సరూర్ నగర్:** సరూర్ నగర్‌లోని బృందవాన్ కాలనీలో రావుల్కోల్ మనీష్ కన్నె స్వామి మహా పడి పూజ తల్లోజు కరుణాకర్ గురుస్వామి ఆధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజలో చెన్నోజు సుమన్, పులిగిల్ల సతీష్ చారి, నరేష్ చారీ, బాలరాజు చారీ, రామూర్తి, అరుణ్. రజినీకాంత్, రాకేష్, మనీదీప్, అనుదీప్, అనిరుద్ సునీల్, సాయి. కిట్టు, ఇతరులు పాల్గొన్నారు.

# విజయ్ జెబి ఇన్ఫ్రా ఆధ్వర్యంలో నూతన వెంచర్ ప్రారంభం

- 222 ఎకరాల మెగా వెంచర్ ప్రారంభం
- ఔటర్ రింగ్ రోడ్డు, రామోజీ ఫిలిం సిటీ దగ్గరలో జెబి టెర్రా గ్రీన్హిల్స్ వెంచర్
- అన్ని ప్రభుత్వ అనుమతులతో కూడుకున్న వెంచర్ ప్రారంభోత్సవం



**విశ్వంభర, చౌటుప్పల్ :** ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ మరొక సరికొత్త వెంచర్ ను తూప్రాన్ పేటలో ఆదివారం సరికొత్త హంగులతో అట్టహాసంగా ప్రారంభోత్సవం జరిగింది. చైర్మన్, సీఎండీ చింతిరెడ్డి విజయ్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో విజయ్ జెబి ఇన్ఫ్రా సరికొత్త సంచలనలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని తెలిపారు. కష్టమర్ల మన్నలను చురకొని అతి తక్కువ కాలంలో అగ్రగామిగా మా సంస్థ నిలిచిందని అన్నారు. తూప్రాన్ పేటలో జేబీ టెర్రగ్రినిహీల్స్ వెంచర్ అద్భుతం సృష్టించబోతుందని అన్నారు. రామోజీ ఫిలిం సిటీకి దగ్గర్లో ,విజయవాడ హైవేకు అనుకొని ఔటర్ రింగ్ రోడ్ నుంచి చాలా తక్కువ దూరంలో ఈ వెంచర్ ఉందని తెలిపారు. మొత్తం 222 మెగా వెంచర్ ను ఘనంగా లాంచ్ చేశామని తెలిపారు. ఐదు ఎకరాల క్లబ్ రోజున నిర్మిస్తున్నామని అన్నారు. సామాన్య ప్రజలు కూడా సొంతింటి కల నెరవేర్చుకునే విధంగా ధరలు నిర్ణయించామని తెలిపారు.బ్యాంకు లోన్ కూడా అందుబాటులో ఉందని, కస్టమర్లు అవకాశాన్ని కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ అనుమతులతో కుడుకున్న హెచ్ఎండిఎ ,డీటీసీపీ ,టిస్ రేరా మా సంస్థకు ఉందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, వాకింగ్ ట్రాక్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్స్ అశోక్ రావు, తిరుపతయ్య, అంజి రామ్, బీరప్ప,దయాకర్ రెడ్డి, మార్కెటింగ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ



**విశ్వంభర, మేడ్చల్:** మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదిగూడా మున్సిపాలిటీ ఐదో డివిజన్ కార్పొరేటర్ బొడిగె స్వాతి క్రిష్ణ గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ గురుస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయ్యప్పస్వాములు భారీగా తరలి వచ్చారు. అలాగే మున్సిపాలిటీ నుంచి భక్తులు పడిపూజ చూసేందుకు వచ్చారు. దీంతో ప్రాంగణం మొత్తం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మరోవైపు పీర్జాదిగూడ రోడ్లు మండపానికి అన్నట్టుగా వాహనాలతో నిండిపోయాయి. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుదీర్ రెడ్డి, మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, వివిధ డివిజన్ కార్పొరేటర్లు, పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం బొడిగె కుటుంబం అందరినీ సన్మానం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.



# బీరప్ప గడ్డ కుమ్మరి సంఘానికి భవనం ఏర్పాటు చేస్తా



కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్


**విశ్వంభర, చిల్కానగర్:** చిల్కానగర్ డివిజన్‌లోని బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం 2025 కాలమానాన్ని ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ విచ్చేసి ఆవిష్కరించారు. అనంతరం కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఎలక్షన్‌లో బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం సభ్యులు ఇచ్చిన మాట ప్రకారం వారి పూర్తి మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భారీ మెజారిటీతో గెలుపునకు సహకరించారని కొనియాడారు. అదే విధంగా వారి అభ్యర్థన మేరకు బీరప్ప గడ్డలోని కుమ్మరి సంఘం స్థలంలో నూతన భవనం ఏర్పాటు చేయాలన్న వారి అభ్యర్థనను వీలైనంత త్వరలో వారికి భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొకొండా జగన్, బింగి శ్రీనివాస్, మార్కా శీను, శ్యామ్ బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భానుచందర్ , కోశాధికారి కుమార్, సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ముక్కోటి ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేసిన జిల్లా కలెక్టరు జితేష్ వి పాటిల్. ఐటీడీఏ ఆధ్వర్యంలో ముక్కోటి ఉత్సవాలలో గోదావరి స్నాన ఘట్టాల వద్ద గిరిజన సంస్కృతి సాంప్రదాయాల కళా రూపాలను,వినోదాల కార్యక్రమం సభా ప్రాంగణాన్ని, వంటకాలను ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు సూచించారు.

## అదుపుతప్పి బోల్తాపడి కారు



**విశ్వంభర, వనపర్తి:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడి ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గా జిల్లా షాదీపూర్ గ్రామానికి చెందిన సచిన్, లత దంపతులిద్దరూ బెంగళూరుకు వెళ్తుండగా పట్టణంలోని జాతీయ రహదారి హైదరాబాద్ బైపాస్ దగ్గర కారు అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న లత స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే 108 అంబులెన్స్ వారికి సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స నిర్వహించి కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

## మల్లికార్జున స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**విశ్వంభర, గొల్లపల్లి:** మండలంలోని మల్లన్న పేటలో కొలువైన మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. బోనం, కొబ్బరికాయలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు టి. రాజేందర్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండూరు శాంతయ్య, ఈవో విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు.. జాగ్రత్తలు పాటించాలి

- వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్త్ తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- సన్ ప్రీత్ సింగ్ ఎస్పీ సూర్యాపేట జిల్లా

**విశ్వంభర, సూర్యాపేట:** నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలి, పోలీసు వారి సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినది అని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు, నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం ముఖ్యంగా పటిష్ఠమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంక్షలను అతిక్రమిస్తే




చర్యలు తప్పవు అని ఎస్పీ హెచ్చరించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలి అని ఎస్పీ కోరారు.

**పోలీసుల సూచనలు**

**నిబంధనలు:**

- నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలి. తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటా0.
- పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి, మైనర్స్ కు వాహనాలు ఇవ్వవద్దు.
- టపాసులు, డీజే లు నిషేధం.
- మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు వేగంగా నడపవద్దు.
- రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు చేయవద్దు.
- మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవద్దు.
- ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు.
- ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరం
- ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా0.
- న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు.
- బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం.
- మైనర్లు వాహనాలు వాహనాలు ఇవ్వవద్దు.
- ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలి.
- న్యూ ఇయర్ అఫర్ ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నది కావున ఆన్లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నబర్స్ లు ఇవ్వవద్దు.

# గాంధీయేతర కాంగ్రెస్ నేతలను గాంధీ కుటుంబం ఎన్నడూ గౌరవించలేదు

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



**అగర్తల:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ) ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మారకం నిర్మించే ప్రాంతంలో కాకుండా నిగంబోధ్‌లో అంత్యక్రియలు నిర్వహించినవిషయంపై కూడా కాంగ్రెస్ నేతలు రాజకీయాలు చేయాలని చూడడం దురదృష్టకరమని అన్నారు. "గాంధీ కుటుంబం" గాంధీయేతర కాంగ్రెస్ నేతలను ఎన్నడూ గౌరవించలేదని. .ఇప్పుడు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణించిన అనంతరం ఆయనకు నివాళులర్పించేందుకు కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటుచేయలేదని ఆయన కుమార్తె శర్మిష్ఠా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు కూడా ఆ పార్టీ తగిన గౌరవం ఇవ్వలేదని అన్నారు. వీటన్నిటిపై గాంధీ కుటుంబం ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. "మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో మాకు సైద్ధాంతిక, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, అతను అత్యంత గౌరవప్రదమైన వ్యక్తి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా మన్మోహన్ అంత్యక్రియలకు ప్రభుత్వం తరఫున పూర్తి బాధ్యత తను తీసుకొని ఆయనకు తగిన గౌరవాన్ని ఇచ్చారు" అని కేంద్రమంత్రి అన్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశంలోనే స్మారక స్థలం నిర్మించాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీ ని కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి చనిపోయినప్పుడు నివాళులర్పించేందుకు కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటుచేయలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ తనను తప్పుదోవ పట్టించిందని కూడా ఆరోపించారు. రాష్ట్రపతులకు ఆ సంప్రదాయం పాటించడం లేదని కాంగ్రెస్‌లోని ఓ సీనియర్ నేత తనకు చెప్పారన్నారు. అయితే.. తన తండ్రి డైరీని చదివితే అది నిజం కాదని తెలిసిందన్నారు. రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్‌కు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించినట్లు అందులో ఉందని వెల్లడించారు.

# ఢిల్లీలో ఆపరేషన్ లోటస్.. బీజేపీపై కేజ్రీవాల్ విమర్శలు




**ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బీజేపీ విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితాలో ఆ పార్టీ అవకతవకలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. తాజాగా విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదనే విషయం బీజేపీకి అర్థమైపోయింది. వారికి సీఎం అభ్యర్థి లేరు. దార్శనికత, విశ్వాసం కలిగిన వ్యక్తులు లేరు. అందుకే కాషాయ పార్టీ గెలుపు కోసం కొత్త ఎత్తుగడలు వేస్తోంది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు 'ఆపరేషన్ లోటస్' స్కామ్ ద్వారా డిసెంబరు 15 నుంచి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగా ఓటరు జాబితాను ట్యాంపరింగ్ చేసింది" అని కేజ్రీవాల్ ఆరోపించారు. "కొన్ని రోజులుగా న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో భాజపా తన ఆపరేషన్‌ను కొనసాగిస్తోంది. ఈ 15 రోజుల్లో 5 వేల మంది ఓటర్లను తొలగించేందుకు కొత్తగా దరఖాస్తులు వచ్చాయి. అంతేకాకుండా.. 7,500 మంది ఓటర్లను జాబితాలో చేర్చేందుకు అప్లికేషన్లు వచ్చాయి. 12 శాతం ఓట్లలో అవకతవకలు జరుగుతున్నాయి" అని కేజ్రీవాల్ అన్నారు.ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 70 స్థానాలకు అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేసింది. కేజ్రీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనుండగా.. సీఎం ఆతిశీ మరోసారి కాల్కాజీ సీటు నుంచి బరిలో నిలుస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. ఆయా పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అస్థికలు నిమజ్జనం



**ఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అస్థికలను యమునా నదిలో నిమజ్జనం చేశారు. శనివారం ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరగ్గా.. ఆదివారం ఉదయం అక్కడి నుంచి ఆయన కుటుంబ సభ్యులు అస్థికలను సేకరించారు. అనంతరం యమునా నది సమీపంలోని 'మజ్ను కా తిలా' గురుద్వారా సమీపంలో కుటుంబ సభ్యులు సిక్కు సంప్రదాయం ప్రకారం ఆయన అస్థికలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ సతీమణి గురుశరణ్ కౌర్, కుమార్తెలు ఉపిందర్ సింగ్, దమన్ సింగ్‌బీ అమృత్ సింగ్‌తో పాటు బంధువులు పాల్గొన్నారు.ఆచారాల్లో భాగంగా జనవరి 1న ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని మన్మోహన్ సింగ్ అధికారిక నివాసంలో అఖండ్ పథ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 3వ తేదీన పార్లమెంటు కాంప్లెక్స్ సమీపంలోని రకాబ్ గంజ్ గురుద్వారా వద్ద భోగ్ వేడుక, అంతిమ్ అర్దాస్, కీర్తన్ జరగనున్నాయి.

# 200 జైళ్లు నిర్మిస్తున్న జిన్‌పింగ్ సర్కారు..



**బీజింగ్:** చైనాలో సర్కారు సరికొత్తగా 200 ప్రత్యేకమైన జైళ్లను నిర్మిస్తోంది. అధ్యక్షుడు జిన్‌పింగ్ చేపట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమంలో వినియోగించేందుకు వీలుగా వీటిని నిర్మిస్తోంది. ఈ విషయాన్ని ఆంగ్ల మీడియా సీఎన్ఎన్ కథనంలో పేర్కొంది. వీటిని లియుజూ కేంద్రాలుగా వ్యవహరిస్తున్నారు. వీటిల్లో అనుమానితులను కుటుంబంతో కలవకుండా.. న్యాయ సాయం అందించకుండా దాదాపు 6 నెలల వరకు బంధించి ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 2012లో జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పార్టీపై పట్టు బిగిస్తున్నారు. వరుసగా అధికారం చేపట్టడం ఇది మూడోసారి. ఆయన మొదటి నుంచి అవినీతిపై పోరాటం పేరిట తన అసమ్మతి వర్గాన్ని జైల్లోవేస్తారన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే గతంలో ఉన్న షుయాంగి వ్యవస్థకు చెడ్డపేరు రావడంతో తాజాగా లియుజూ కేంద్రాలతో భర్తీ చేయనున్నారు. 24 గంటలూ గస్తీ, నిఘా కెమెరాలు వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిల్లో కేవలం కమ్యూనిస్టు పార్టీ అధికారులేకాదు.. అధికారులు, సివిల్ సర్వెంట్లు, హైప్రొఫైల్ వ్యక్తులు, వ్యాపారవేత్తలు వంటి వారిని లక్ష్యంగా చేసుకోనున్నట్లు తెలుస్తోంది. 2017-2024 మధ్యలో 210 లియుజూ సెంటర్లను నిర్మించడమో.. విస్తరించడమో చేశారు. ఇక్కడ బంధించిన వారిని కనీసం సరిగ్గా నిద్రకూడా పోనీయరు. వారు దాదాపు 18గంటల సేపు కూర్చొనే ఉండాలని ఈ కేంద్రాల్లో పనిచేసిన మాజీ అధికారి ఒకరు తెలిపారు.ఈ కేంద్రాలను నిర్మించడానికి ప్రత్యేకమైన నిబంధనలున్నాయి. 2023 నుంచి 2027వరకు నిర్మాణం చేపట్టేవాటిల్లో ఖైదీలు తమకు తాము ఎటువంటి హానీ చేసుకోవడానికి వీల్లేకుండా చూడనున్నారు. ఇందుకోసం ప్యాడెడ్ వాల్, యాంటీ స్లీప్ సర్ఫేస్ వంటివి నిర్మించున్నారు.

# నేడు పీఎస్ఎల్‌వీ సీ 60 రాకెట్ ప్రయోగం..

## మరి కొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ ప్రారంభం




**అమరావతి :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ప్రయోగానికి సిద్ధమయ్యింది. సోమవారం ప్రయోగించనున్న పీఎస్ఎల్‌వీ సీ 60 రాకెట్‌కు మరికొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సూళ్లురుపేట షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు రాకెట్‌ను నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు.ఈ రాకెట్ ప్రయోగానికి ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభానికి ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ రాత్రి బెంగళూరు నుంచి షార్‌కు చేరుకోనున్నారు. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. సోమవారం నింగికేగనున్న పీఎస్ఎల్‌వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు.స్ట్రాపాన్ బూస్టర్లను ఉపయోగించకపోవడంతో ఈ రాకెట్ బరువు 229 టన్నులుగా ఉంటుందని వివరించారు. రాకెట్‌లో రెండో దశకు ద్రవ ఇంధనం, మూడో దశకు ఘన ఇంధనం, నాలుగో దశకు ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నట్లు వివరించారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలు ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటిని ఛేజర్, టార్గెట్ అనే పేర్లను నామకరణం చేశామన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మా నవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.

# చర్చిలో 'జై శ్రీరామ్' అన్న యూట్యూబర్.. కేసు నమోదు చేసిన పోలీసులు.!



**ఢిల్లీ:** ఈ మధ్య సోషల్ మీడియాలో పలు యూట్యూబర్‌లు, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు వ్యూస్, లైక్స్ కోసం ప్రతి చెత్త కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటికి మొన్న హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఒక వ్యక్తి డబ్బుల కట్టలను పడేసి.. నేను డబ్బులు చెట్ల పోదల్లో పడేశాను. దొరికితే తీసుకొండి అంటూ వీడియో చేయగా.. ఈ వీడియో ఫుల్ వైరల్‌గా మారడంతో పాటు అతడి చేసిన పనికి పోలీసులు తనపై కేసు నమోదు చేశారు. ఇవే కాకుండా రోజు ఇలాంటి వీడియోలే మనం తరచూ చూస్తూ ఉంటాం.ఇదిలావుంటే ఆకాశ్ సాగర్ అనే యూట్యూబర్ చేసిన చెత్త పని ప్రస్తుతం క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినేలా చేసింది. ఆకాశ్ సాగర్ అనే హిందీ యూట్యూబర్‌కి అటు యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. అతడు చేసేది. అడల్ట్ కంటెంట్ అయిన ఫాలోవర్లను బాగానే పెంచుకున్నాడు ఆకాశ్. అయితే అతడు రీసెంట్‌గా మేఘలయాకు ట్రిప్‌కి వెళ్లగా.. అక్కడ చేసిన ఒక చెత్త పని ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది.మేఘలయా ట్రిప్‌కి వెళ్లిన ఆకాష్ తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో ఉన్న మావ్లిన్నాంగ్‌లోని ఎపిఫనీ చర్చ్‌లోకి వెళ్లి అందరిముందు ప్రభాస్ నటించిన ఆదిపురుష్‌లోని జై సియా రామ్ అనే పాట పాడడంతో పాటు.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశాడు. ఇదంత ఒక వీడియోగా క్రియేట్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. ఈ ఘటన డిసెంబర్ 20న జరిగింది. అయితే దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో మేఘలయ ప్రభుత్వం దీనిపై తీవ్రంగా స్పందించింది. చర్చిలోకి ప్రవేశించి బలవంతంగా జై శ్రీరామ్ అనడంతో పాటు భక్తులు మనోభావాలను దెబ్బతీసినందుకు అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకాష్ కావాలని ముందే ప్లాన్ చేసి.. ఉద్దేశపూర్వకంగా చేశాడని ఇటువంటి చర్యలు మతపరమైన గొడవలను సృష్టించడంతో పాటు క్రైస్తవుల విశ్వాసాన్ని అవమానిస్తుందని షిల్లాంగ్‌కు చెందిన సామజిక కార్యకర్త పేర్కొంది. మరోవైపు ఈ ఘటనపై మేఘాలయ సిఎం కాన్రాడ్ కె సంగ్మా ఖండించడంతో పాటు.. అతడిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించాడు.

# 16 గంటలు శ్రమించినా దక్కని ప్రాణం..

## బోరుబావిలో పడిన బాలుడి మృతి

**భోపాల్:** మధ్యప్రదేశ్ లోని గుణ జిల్లాలో 140 అడుగుల బోరుబావి లో పడిన పదేళ్ల బాలుడు సుమిత్ మీనాను రెస్క్యూ సిబ్బంది రక్షించారు. అయినప్పటికీ ఆ బాలుడి కథ విషాదాంతమైంది. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుణ జిల్లాలోని పిప్లియా గ్రామంలో శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో సుమిత్ మీనా అనే బాలుడు ఆడుకుంటూ పక్కనే ఉన్న 140 అడుగుల లోతున్న బోరుబావిలో పడిపోయాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు సహాయ చర్యలు ప్రారంభించారు. బోరుబావికి కొంత దూరంలో గొయ్యి తీసి బాలుడిని కాపాడారు. అప్పటికే బాలుడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆసుపత్రికి తరలించగా.. అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.గుణ జిల్లా చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, "బాలుడు రాత్రంతా చల్లటి వాతావరణంలో ఉండడం వల్ల చేతులు, కాళ్లు తడిచి వాచిపోయాయి. అల్పోష్ణస్థితి (కోర్ బాడీ టెంపరేచర్ 95 డిగ్రీల ఫారెన్‌హీట్ కంటే తక్కువగా పడిపోయినప్పుడు ఏర్పడే పరిస్థితి) కారణంగా శరీర భాగాలు స్తంభించిపోయాయి. మెరుగైన వైద్యం అందించినా సమయం మించిపోయినం దున బాలుడిని కాపాడుకోలేకపోయాం" అని తెలిపారు.

## ఏడు రోజులుగా బావిలోనే చిన్నారి..

రాజస్థాన్‌లోని కోఠ్‌పుత్లీ- బెహ్రార్ జిల్లాలో చేతన అనే చిన్నారి తండ్రి పొలంలో ఆడుకుంటూ 700 అడుగుల బోరుబావిలో పడిపోయిన విషయం తెలిసింది. 150 అడుగుల వద్ద ఉన్న చిన్నారిని బయటకు తీసేందుకు దాదాపు ఏడు రోజులుగా సహాయ సిబ్బంది శ్రమిస్తున్నారు.బుడిబుడి అడుగుల తన చిన్నారి చీకటిలో చిక్కుకొని..ఆకలి, దప్పికతో ఎన్ని బాధలు పడుతుందో అని తలుచుకుంటూ ఆమె తల్లి గుండులవిసేలా రోదిస్తోంది. త్వరగా తమ కుమార్తెను రక్షించాలంటూ అధికార యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. చిన్నారిని బయటకు తీసేందుకు ర్యాట్ హోల్ మైనర్స్ సహాయం తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

# హెచ్1బీ వీసాలకు నేనెప్పుడూ అనుకూలమే: డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్:** హెచ్1 బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ , భారతీయ- అమెరికన్ వివేక్ రామస్వామి ఈ చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇచ్చారు. దీనిపై అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగులు అమెరికాకు రావడానికి ఉపయోగపడే ప్రత్యేక వీసా ప్రోగ్రాంకు తాను మద్దతిస్తున్నానని తెలిపారు. తాను ఎల్లప్పుడూ హెచ్1 బీ లకు అనుకూలంగా ఉంటానని అన్నారు. అందుకే తమ దేశంలో ఆ వీసాలు ఉన్నాయని అన్నారు. అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీకి సంయుక్త సారథులుగా నియమితులైన మస్క్, వివేక్ రామస్వామి ఈ విషయంపై మాట్లాడారు. యూఎస్ తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నందున ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గలవారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బీ వీసా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. టాలెంట్ ఎక్కడున్నా దానిని అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతివ్వాలని కోరారు. మస్క్ కూడా హెచ్1బీ వీసా పైనే అమెరికాకు వలస వచ్చారు.కాగా ఈ విషయంపై పలువురు భిన్నమైన వాదనలు వినిపించారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన నిక్కీ హేలీ మాట్లాడుతూ తాను సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేసిన సమయంలో నిరుద్యోగిత రేటు 11 శాతం నుంచి 4 శాతానికి పడిపోయిందని అన్నారు. విదేశీ ఉద్యోగులను కాకుండా పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాం కాబట్టే అది సాధ్యమైందని.. కొత్త ఉద్యోగాల కోసం ప్రజలకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు ఇప్పుడు విమానాలు, ఆటోమొబైల్స్ తయారీలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకానీ అమెరికన్లను తక్కువ అంచనా వేయొద్దని తన అభిప్రాయాన్ని వినిపించారు.ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలిగ్గా నియమించుకొనేందుకు అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం పలు నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతోపాటు సులువుగా ఎఫ్-1 విద్యార్థి వీసాలను హెచ్-1బీ వీసాలుగా మార్చుకొనే అవకాశం కల్పించింది. ఇది లక్షల మంది భారతీయ వృత్తి నిపుణులకు ప్రయోజనం కల్పించనుంది. ఈ వీసా నాన్ ఇమిగ్రెంట్ కేటగిరీలోకి వస్తుంది. టెక్నాలజీ కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను దీని సాయంతో నియమించుకొంటుంటాయి. ముఖ్యంగా భారత్, చైనా దేశాలు ఈ వీసా నుంచి చాలా లబ్ధి పొందాయి.

# మరో రెండు విమానాలకు తప్పిన పెను ప్రమాదాలు..!




**ముయాన్:** దక్షిణ కొరియాలోని ముయాన్ ఎయిర్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదంలో 179 మంది ప్రాణాలు కోల్పోగా.. కొన్ని గంటల తేడాతో మరో రెండు విమానాలు వేర్వేరు దేశాల్లో అలాంటి ప్రమాదాలనే తప్పించుకున్నాయి. ఎయిర్ కెనడాకు చెందిన విమానానికి శనివారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. హాలిఫాక్స్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ కెనడాకు చెందిన ఏసీ2559 విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది.ఆ సమయంలో దాని ల్యాండింగ్ గేర్ విఫలం కావడంతో రన్‌వేపై ఓ పక్కకు జారిపోయి మంటలు వచ్చాయి. ఈ విమానం కెనడాలోని సెయింట్ జోన్స్ నుంచి హాలిఫాక్స్‌కు ప్రయాణిస్తోంది. ఇది డాష్ 8-400 రకం విమానంగా గుర్తించారు. ఈ ప్రమాదంలో దాని రెక్కలు పూర్తిగా రన్‌వేకు రాసుకుపోయాయి. ఆ సమయంలో మంటలు వచ్చినట్లు ప్రయాణికులు తీసిన వీడియో దృశ్యాల్లో కనిపిస్తున్నాయి. దీంతో ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దక్షిణ కొరియాలో విమాన ప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే ఇది చోటు చేసుకొంది.

## నార్వేలో కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్..

రాయల్ డచ్‌కు చెందిన విమానం ఒకటి నార్వేలోని టోర్ప్ ఎయిర్‌పోర్టులో రన్‌వేపై అదుపు తప్పింది. బోయింగ్ 737-800శ్రేణికి చెందిన విమానం ఇది. ఓస్లో ఎయిర్ పోర్టులో టేకాఫ్ తీసుకొన్న వెంటనే.. హైడ్రాలిక్ ఫెయిల్యూర్ చోటుచేసుకొంది. దీంతో 110 కిలోమీటర్ల దూరంలోని టోర్ప్ ఎయిర్ పోర్టుకు దీనిని మళ్లించారు. ఇది సురక్షితంగా నేలపైకి దిగినా.. రన్‌వే పై మాత్రం అదుపుతప్పింది. ఈ విషయాన్ని ఏవియేషన్ 24 సంస్థ పేర్కొంది. కాకపోతే ఇది సురక్షితంగా సమీపంలోని గడ్డి మైదానంలోకి వెళ్లి ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన సమయంలో విమానంలో మొత్తం 182 మంది ఉన్నారు. ప్రయాణికులను అత్యవసరంగా విమానం నుంచి దించేశారు. విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసేసి సహాయక చర్యలు చేపట్టారు. బోయింగ్ 737-800 శ్రేణి విమానమే దక్షిణ కొరియాలో ప్రమాదానికి గురైంది.

# గంటకు 450 కిలోమీటర్లు.. అత్యాధునిక రైలును ఆవిష్కరించిన చైనా



**బీజింగ్:** చైనా వరుసగా ఆవిష్కరణలను ప్రపంచానికి చూపిస్తోంది. తాజాగా గంటకు అత్యధికంగా 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలబుల్లెట్ రైలును ప్రపంచానికి పరిచయంచేసింది. దీనిని సీఆర్450 గా వ్యవహరిస్తోంది. ఆదివారం బీజింగ్‌లో పరీక్షించారు. గంటకు 400 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంది. ఈ రైల్ డిజైన్ చాలా నాజుగ్గా, బుల్లెట్ షేప్ ముక్కుతో ఉంటుందని చైనా రైల్వే వెల్లడించింది. ఇది అత్యధికంగా గంటకు 450 కిమీ వేగాన్ని అందుకోగలదని తెలిపింది. ఇది వినియోగంలోకి వచ్చే నాటికి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాణిజ్య రైలుగా నిలుస్తుందని చెప్పింది. ఈ ట్రైన్ బీజింగ్ నుంచి షాంఘైకి కేవలం 2.5 గంటల్లోనే ప్రయాణించగలదు. గతంలో ఈ ప్రయాణానికి నాలుగు గంటల సమయం పట్టేది.ప్రస్తుతం చైనాలోని హైస్పీడ్ రైలు వ్యవస్థ అతిపెద్దది. మొత్తం 45,000 కిలోమీటర్ల మేరకు విస్తరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే చైనా ప్రభుత్వరంగ రైల్వే సంస్థ సీఆర్450 ప్రొటోటైప్‌ను డిసెంబర్‌లో పరీక్షిస్తామని పేర్కొంది. చైనా 14వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. దీని కింద హైస్పీడ్ రైళ్లు, వంతెనలు, ట్రాక్‌లు, సొరంగాలు నిర్మించనున్నారు. ఈ రైలు బాడీ బరువు కేవలం 10 టన్నులు మాత్రమే. ప్రస్తుతం సీఆర్400 మోడల్ కంటే ఇది 12 శాతం తక్కువ. విద్యుత్తును కూడా 20 శాతం తక్కువగానే వినియోగించుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక గత మోడల్ కంటే అదనంగా 50 కిలోమీటర్లు అధిక వేగంతో ప్రయాణించగలదు. ఇంజిన్ పరీక్షల్లో ఇది అత్యధికంగా గంటకు 453 కిమీ వేగాన్ని అందుకుంది.చైనా రెండ్రోజుల క్రితమే ఆరో తరానికి చెందినదిగా చెబుతున్న జె-36 యుద్ధ విమానాన్ని ఆవిష్కరించింది. సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూలో దీనిని అభివృద్ధి చేసినట్లు భావిస్తున్నారు. దీనికి మూడు ఇంజిన్లు అమర్చినట్లు భావిస్తున్నారు. ఇది అమెరికాకు చెందిన ఎఫ్-35, ఎఫ్-22 రాప్టర్లను సవాలు చేయగలదని చెబుతున్నారు.

# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఏపీ డీజీపీ తిరుమలరావు

- టీటీడీకి రూ.5 లక్షల సేంద్రియ ఎరువులు విరాళం
- తెలంగాణ రాజకీయ ప్రతినిధుల సిఫార్సు లేఖలపై నిర్ణయం తీసుకోలేదు : టీటీడీ ఈవో
- తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



విశ్వంభర, తిరుమల : ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం బ్రేక్‌దర్శన్‌లో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు డీజీపీకి ఘన స్వాగతం పలికారు. దర్శనంతరం రంగ నాయకుల మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి డీజీపీ దంపతులకు శ్రీవారి ప్రసాదాన్ని, తీర్థ ప్రసాదాలను, స్వామివారి ఫొటోను అందజేశారు. డీజీపీ వెంట ఎస్పీ సుబ్బారాయుడు, సీవీఎస్‌వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రాజకీయ ప్రతినిధుల సిఫార్సు లేఖలపై నిర్ణయం తీసుకోలేదు : టీటీడీ ఈవో

తిరుమలలో శ్రీవారి దర్శనానికి సంబంధించి తెలంగాణ రాజకీయ ప్రతినిధుల సిఫార్సు లేఖలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని టీటీడీ ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు. మీడియా లో వస్తున్న ఊహాగానాలు నిరాధారమని కొట్టిపారేశారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల దర్శన అభ్యర్థనల కోసం వారానికి రెండు రోజులు సిఫార్సు లేఖలను స్వీకరించడానికి టీటీడీ అంగీకరించినట్లు సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలను ఖండించారు. ఈ విషయంపై చర్చలు కొనసాగుతున్నాయని ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు.

## టీటీడీకి రూ.5 లక్షల సేంద్రియ ఎరువులు విరాళం

తిరుపతికి చెందిన క్రియాజన్ అగ్రి అండ్ బయోటెక్ కంపెనీ టీటీడీ అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉన్న అటవీ , ఉద్యానవన సంరక్షణ కోసం రూ. 5 లక్షల విలువ గల 20 టన్నుల సేంద్రియ ఎరువులను విరాళంగా అందించింది. సేంద్రియ ఎరువులను ఉప అటవీ సంరక్షణ అధికారి శ్రీనివాస్‌కు తిరుపతిలోని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య చేతుల మీదుగా తిరుపతి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మనోహర్ బాబు, అగ్రికల్చరల్ ఆఫీసర్ ప్రపూర్ణ, కంపెనీ సిబ్బంది జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అందజేశారు.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు అన్ని నిండిపోయి ఎంపీసీ వరకు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం అవుతుందని అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 78,414 మంది దర్శించుకోగా 26,100 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు



సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.45 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

## జనవరి నెలలో తిరుమలలో జరిగే విశేష పర్వదినాలు ఇవే

విశ్వంభర, తిరుమల : కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి వెలసిన తిరుమల పుణ్యక్షేత్రంలో జనవరి నెలలో జరిగే విశేష కార్యక్రమాలను టీటీడీ అధికారులు ప్రకటించారు. జనవరి 9న చిన్న శాత్తుమొర, 10న వైకుంఠ ఏకాదశి, స్వర్ణ రథోత్సవం, వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం, 11న వైకుంఠ ద్వాదశి, స్వామి పుష్కరిణి తీర్థ ముక్కోటి చక్ర స్నానం పర్వదినాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15వ తేదీన ప్రణయ కలహోత్సవం గోదా పరిణయం, 17న తిరుమళిసై ఆళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 18న శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవం, 19న పెద్ద శాత్తుమొర, వైకుంఠ ద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు వివరించారు. 20న శ్రీ కూరత్తాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 23న అధ్యాయనోత్సవాలు సమాప్తం, 24న తిరుమల నంబి చెంతకు శ్రీ మలయప్పస్వామి వేంచేపు, 25న సర్వ ఏకాదశి, 26న గణతంత్ర దినోత్సవం, 27న మాస శివరాత్రి, 29న శ్రీ పురంధర దాస ఆరాధన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# అప్పులు చేయడంలో చంద్రబాబు దిట్ట మాజీ మంత్రి బుగ్గన




విశ్వంభర, అమరావతి : అప్పులు చేసి రాష్ట్రాన్ని తిప్పలు పాలు చేయడంలో ఏపీ సీఎం చంద్రబాబుఎప్పుడూ ముందంజలో ఉంటారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో లక్షా 20 వేల కోట్లు అప్పుచేశారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రాజధాని పేరిట రూ. 31వేల కోట్లు అప్పుటు చేశారని, అప్పుల వల్ల రాష్ట్రం ఏమవుతుందో ఆందోళనకరంగా ఉందని అన్నారు. చేసిన అప్పులు ఎవరు కడతారని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో కేవలంలో 13 శాతం మాత్రమే అప్పులు చేయగా కూటమి ఆరు నెలల కాలంలో 22.6 శాతం అప్పులు చేసిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కావడం లేదని బుగ్గన ఆరోపించారు. చేనేత రుణాలు మాఫీ,పుట్టిన ప్రతీ బిడ్డకు మహాలక్ష్మి పథకం కింద డబ్బుల హామీ ఎంతవరకు వచ్చిందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజన్ డాక్యుమెంట్ పేరిట ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు పెట్టారని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం అటకెక్కిందని వాపోయారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఊసు ఎత్తడం లేదని విమర్శించారు. దీపం పథకానికి రూ. 3,955 కోట్లు అవసరముండగా బడ్జెట్‌లో రూ. 895 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు కాకుంటే నిలదీస్తానని కూటమిలో ఉన్న నేత గతంలో వివరించారని, అదే నేత ఇప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నారో తెలుపాలని డిమాండ్ చేశారు. వైసీపీ 12 లక్షల కోట్లు అప్పు చేసిందని తప్పుడు ప్రచారం చేసి కూటమి అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాత్రం 7లక్షల22 వేల కోట్లు మాత్రమే గత ప్రభుత్వం అప్పులు చేసిందని లెక్కలు చూపించారని తెలిపారు. ఇందులో కూడా గత టీడీపీ చేసిన అప్పులే సగం వరకు ఉన్నాయని ఆరోపించారు.

# గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డు కోసం విజయవాడలో గేమ్ ఛేంజర్ రాంచరణ్ భారీ కటౌట్



విశ్వంభర, అమరావతి : గ్లోబల్‌స్టార్ రాంచరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా విజయవంతం కావాలని కోరుతూ ఆయన అభిమానులు భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారి విజయవాడ వజ్ర గ్రౌండ్‌లో 256 అడుగుల ఎత్తు వరకు రాంచరణ్ కటౌట్‌ను నెలకొల్పారు. రాంచరణ్ పేరిట గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డు ఉండాలనే లక్ష్యంతో ఈ భారీ కటౌట్‌ను రాంచరణ్ యువశక్తి ఆధ్వర్యంలో నెలకొల్పామని అభిమానులు తెలిపారు. సుమారు వారం, పదిరోజుల పాటు నుంచి చెన్నై వారి సహకారంతో నిర్మాణ పనులు చేపట్టామని వెల్లడించారు.

# బోటు బోల్తా పడి మత్స్యకారుడు మృతి

విశ్వంభర, పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో ప్రమాదవశాత్తు ఆదివారం బోటు బోల్తా పడింది.. ముత్యాలపాలానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు ఎప్పటి మాదిరి లాగానే చేపల వేటకు వెళ్లారు. అయితే బోటు బోల్తా పడడంతో కొవ్వూరి మసేను మృతి చెందాడు. మరో ఐదుగురు సురక్షితంగా ఈత ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు.. మసేను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి, ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోగులకు మెరుగైన సేవలు అందించే కార్యక్రమాలు చేపడతాం

విశ్వంభర, విశాఖ : కింగ్ జార్జి ఆసుపత్రిలో రానున్న కాలంలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్తగా 7 విభాగాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఓపీ విభాగాన్ని రూ.కోటి ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సహాయంతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

# స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం

విశ్వంభర, ఎంవీపీ కాలనీ: స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వీఎంఆర్డీయే ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. ఎంవీపీ కాలనీ ఆళ్వార్ దాస్ మైదానంలో జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జీ మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టాల్స్‌ను సందర్శించి స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసిన ఉత్పత్తులు వివరాలు తెలుసుకున్నారు. సంఘ సభ్యులు విక్రయిస్తున్న చీరను ఛైర్మన్ ప్రణవ్ వారి అమ్మగారి కోసం కొనుగోలు చేశారు. ప్రతీ ఒక్కరు వీరి ఉత్పత్తులు కొనుగోలు చేసి ఆదరించాలని కోరారు. ఈ తరహా మేళాలు నిర్వహణకి వీఎంఆర్డీయే పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీ పీడీ సత్యవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన సేవలు అందించే కార్యక్రమాలు చేపడతాం

విశ్వంభర, విశాఖ వన్‌టౌన్: కింగ్ జార్జి ఆసుపత్రిలో రానున్న కాలంలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్తగా 7 విభాగాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఓపీ విభాగాన్ని రూ.కోటి ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సహాయంతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

# అనారోగ్యంతో సీనియర్ న్యాయవాది మృతి

విశ్వంభర, కొత్తకోట(తెనాలి): వేద గంగోత్రి ఫౌండేషన్ విజయవాడ అధ్యక్షులు.. సీనియర్ న్యాయవాది జీవిఎన్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ అనారోగ్యం కారణంగా ఆదివారం తెల్లవారుజామున మరణించారు. కళాకారుడుగా కళాపోషకుడిగా కళాభిమానిగా కళారంగానికి వారు చేసిన సేవలు ఎనలేనివి.గత నాలుగు సంవత్సరాలుగా వీణా అవార్డ్స్ లో ప్రధాన భూమిక పోషిస్తూ సంస్థ ఉన్నతికి మరింత పాటుపడిన మహనీయుడు. తెనాలి కళలకు సంబంధించిన అధ్యక్షులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# పేర్ని నాని, ఆయన బినామీలకు చుక్కలు చూపిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర



విశ్వంభర, అమరావతి:చట్టంనుంచి మాజీ మంత్రి పేర్ని నాని తప్పించుకోలేరని మంత్రి కొల్లురవీంద్ర అన్నారు. పేదల బియ్యం తినేసి ఇప్పుడు ఆయన నీతి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిలో మీడియాతో కొల్లు రవీంద్ర మాట్లాడారు.“ భార్య పేరుతో గిడ్డంగి ఉంటే జాగ్రత్తగా ఉండాల్సిన బాధ్యత లేదా?ఆమె పేరు వాడుకుని సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటు. చోరీ చేసి డబ్బు తిరిగిచ్చేస్తే దొర అయిపోరు.. దొంగ.. దొంగే. పేర్ని నాని, ఆయన బినామీలకు చుక్కలు చూపిస్తాం. అక్రమాలపై ఈడీ విచారణ జరిపిస్తాం. పోర్టు సమీపంలోని ప్రజల భూములను లాక్కోవడం వాస్తవం కాదా?” అని కొల్లు రవీంద్ర నిలదీశారు.

# స్టెల్లా నౌక నుంచి పూర్తిగా రేషన్ బియ్యం అన్‌లోడ్




విశ్వంభర, కాకినాడ: కాకినాడ పోర్టులో స్టెల్లా నౌక నుంచి అధికారులు రేషన్ బియ్యాన్ని పూర్తిగా అన్‌లోడ్ చేశారు. ఈ షిప్‌లో అధికారులు 1,320 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. రెండు బ్యార్జిల్లో దీన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. ఈ బియ్యాన్ని యాంకరేజ్ పోర్టు గిడ్డంగిలో నిల్వ చేయనున్నారు. విదేశాలకు బియ్యం అక్రమంగా రవాణా జరుగుతోందనే ఆరోపణలతో గత నెల 11 నుంచి స్టెల్లా నౌకను కాకినాడలో నిలిపి ఉంచారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లి షిప్‌ను పరిశీలించారు.

# సిమెంటు లోడుతో వెళ్తున్న లారీలో చెలరేగిన మంటలు

విశ్వంభర, ఉంగుటూరు: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పొట్టిపాడు వద్ద లారీలో అగ్నిప్రమాదం సంభవించింది. సిమెంటు లోడుతో వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

# ఏపీలో పెరిగిన సైబర్ నేరాలు.. రూ.1,229 కోట్లు మాయం

## ఏపీ డీజీపీ తిరుమలరావు



విశ్వంభర, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో సైబర్ నేరాలు గణనీయంగా పెరిగాయి. ఒక ఏడాదిలోనే రూ. 1,229 కోట్ల సొత్తును సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. ముఖ్యంగా ఫోన్‌కాల్స్ ద్వారా పోలీసులకు 7,23,378 ఫిర్యాదులు అందడం రికార్డు. 2024లో రాష్ట్రంలో జరిగిన నేరాలను డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. సగటున రోజుకు రూ. 3.36 కోట్లను సైబర్ నేరగాళ్లు డబ్బును దోచుకున్నారని వివరించారు. 2023లో ఫోన్‌కాల్స్ ద్వారా 4.74,391 కాల్స్ రాగా 682 కేసుల్లో రూ. 173 కోట్లను బాధితులు నష్టపోయారు. 2024లో 52.4 శాతం ఫిర్యాదులు పెరుగగా బాధితుల నుంచి 610 శాతం సొత్తును కోల్పోయ్యారని డీజీపీ తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి , మాదకద్రవ్యాలను అరికట్టడానికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టినా కాని గతంలో కంటే ఎక్కువగా కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. మొత్తంగా అన్ని రకాల నేరాలపై గతేడాది 97,760 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 92,094కు పరిమితమైందన్నారు. ఈ ఏడాది హత్యలు, హత్యాయత్నం కేసులు తగ్గగా, లాభం కోసం హత్యలు, దోపిడీలు, పగలు, రాత్రి వేళల్లో ఇళ్లలో దొంగతనాలు ఎక్కువయ్యాయని తెలిపారు. మహిళల హత్యలు పెరుగగా అత్యాచారాలు, వరకట్న చావులు, మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనలు గణనీయంగా తగ్గాయని వివరించారు. ఏపీలో గత ఏడాది 18,597 రోడ్డు ప్రమాదాల్లో 8,136 మంది చనిపోగా 20,977 మంది గాయపడ్డారని తెలిపారు. 2024లో 17,688 రోడ్డు ప్రమాదాల్లో 7,863 మంది చనిపోగా 19,711 మంది క్షతగాత్రులయ్యారని అన్నారు.

# పొన్నూరు వీరాంజనేయస్వామిని దర్శించున్న జస్టిస్ ఎన్వీ రమణ



విశ్వంభర, గుంటూరు: పొన్నూరు వీరాంజనేయస్వామిని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే



విశ్వంభర, విజయనగరం: సిరిపురంలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులను ఓదార్చిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజాం నియోజకవర్గంలో సంతకవిటి మండలం సిరిపురంలో జరిగిన అగ్నిప్రమాదం చాలా దురదృష్టకరమని, వీరికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఆదుకుంటుందని వారు హామీ ఇచ్చారు. పక్కా ఇల్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. వారికి ఎంపీ అప్పలనాయుడు రూ.లక్ష, ఎమ్మెల్యే మురళీ రూ.రెండు లక్షలు ఆర్థికసాయం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు రూ.10వేలు బియ్యం అందించారు.

# అగ్నిప్రమాదంతో పూ గుడిసె దగ్ధం

విశ్వంభర, కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎనిమిదో వార్డు రామాలయం సమీపంలో ఒక వృద్ధురాలు మరణించడంతో ఆమె అంతిమ యాత్ర సందర్భంగా తారా జువ్వలు కాల్చడంతో వాటిలో ఒకటి ఆ పక్కనే మంగపతిదేవిపేట పంచాయతీలో గుమాస్తాగా పని చేస్తున్న పిన్నింటి భాను కుటుంబం నివాసం ఉంటున్న తాటాకింటిపై పడింది. అనంతరం మంటలు చెలరేగాయి. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. ఆ సమయంలో ఇంటి దగ్గర ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# సీపీఎం మహాసభలు ప్రారంభం

విశ్వంభర, ఎమ్మిగనూరు: కర్నూలు జిల్లా సీపీఎం మహాసభలు ఎమ్మిగనూరు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి భారీ ఎత్తున పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు రామాంజనేయులు, రాధాకృష్ణ, గోవిందు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# పేర్నినాని సరెండర్ కావాలి: జేసీ ప్రభాకర్ రెడ్డి

విశ్వంభర, అనంతపురం: రేషన్ బియ్యం వ్యవహారంలో పేర్ని నాని సరెండర్ కావాలని తెలుగుదేశం పార్టీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పేర్ని నాని తన కుటుంబంపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారన్నారు. పేదల బియ్యం దోచుకున్న పేర్ని నానికి ఇవాళ కుటుంబం గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. రేషన్ బియ్యం గోడౌన్ పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉందని పేర్కొన్నారు. రేషన్ బియ్యం దోచుకున్న పేర్నినాని కుటుంబాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# సముద్రంలో అలల తాకిడికి బోటు ధ్వంసం

విశ్వంభర, ఇచ్చాపురం: డొంకూరు సముద్రంలో



లంగరు వేసిన బోటు అలల తాకిడికి మునిగి ధ్వంసమైంది. వివరాల్లోకి వెళ్తే డొంకూరు గ్రామానికి చెందిన బడే చిన్నారావుతో పాటు మరి కొంతమంది మత్స్యకారులు కలిసి సముద్రంలో వేట సాగించేందుకు శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వెళ్లారు. వేట ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున తీరానికి చేరుకున్నారు. తీరానికి సమీప ప్రాంతం సముద్రంలో బోటును లంగరు వేసి ఇళ్లకు వచ్చేసారు. ఇంతలోనే రాకాసి అలలు తాకిడికి లంగరు వేసిన బోటు మునిగి ధ్వంసం అయింది. ఈ ఘటనలో రూ.ఐదు లక్షల మేర నష్టం వాటిలిందని మత్స్యకారులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకుని మత్స్యకారులు బోర్డును ఒడ్డుకు చేర్చారు. నష్టపోయిన మత్స్యకారునికి ప్రభుత్వం ఆదుకోవాలని తోటి మత్స్యకారులు కోరుతున్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యం వల్ల

# పోలీసులు నైపుణ్యాలు కోల్పోతున్నారు: హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్:** రేవంత్ రెడ్డి పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని, క్రైమ్ రేటు పెరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే క్రైమ్ రేటు 22.5 శాతం పెరిగిందని తెలిపారు. మహిళలపై అత్యాచారాలు 28.94 శాతం పెరిగాయన్నారు. ఏడాదిలోనే 2,945 కేసులు అంటే.. సగటున రోజుకు 8 కేసులు నమోదవుతున్నాయని అన్నారు. 82 మంది మైనర్ బాలికలపై అఘాయిత్యాలు జరగడం సిగ్గుచేటు అని విమర్శించారు. మహిళలకు భద్రత కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదని అన్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నాలుగు నెలల క్రితం విశ్రాంత బ్యాంకు మేనేజర్ గంగారెడ్డి, ఆయన భార్య జంట హత్య, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్య కేసులో కూడా ఇప్పటివరకు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో 163కి పైగా ప్రధాన కేసులు ఇప్పటికీ పరిష్కారం కాలేదని హరీశ్‌రావు తెలిపారు. రూ.10కోట్ల విలువైన ఆర్థిక మోసాలకు సంబంధించి రికవరీ జరగలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో నేరాల గుర్తింపు రేటు 31 శాతం ఉందని అన్నారు. ఇది బిహార్ (39 శాతం) వంటి రాష్ట్రాలతో పోటీపడే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజా భద్రత పూర్తిగా దిగజారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యం వల్ల తెలంగాణ పోలీసులకు ఉన్న మంచి నైపుణ్యాన్ని, శక్తిని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడానికి సీఎం రేవంత్ రెడ్డే కారణమని చెప్పారు. ప్రజా భద్రత గురించి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు, రాజకీయ దాడులకు పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారని, సోషల్‌మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తే వేధింపులకు గురిచేస్తారని, ఆఖరికి పేరు మరిచిపోతే కూడా కేసులు పెట్టి వేధిస్తారని విమర్శించారు.ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పోలీసులను వాడుకోకుండా ప్రజల భద్రత కోసం లా అండ్ ఆర్డర్ సంరక్షణ కోసం పోలీసు శాఖను వాడితే బాగుంటుందని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో క్రైమ్ రేటు తగ్గించడానికి మెరుగైన లా అండ్ అర్డర్ నిర్వహించేందుకు ప్రభుత్వం సకాలంలో పోలీసు శాఖకు బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖను బలోపేతం చేయాలని సూచించారు. చిల్లర రాజకీయాల కంటే ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని పెంచాలని, వేగవంతమైన న్యాయాన్ని అందించాలని సూచించారు. అంతేకానీ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ఉపయోగించుకోకూడదని చెప్పారు.

# తిరుమలలో అందర్నీ సమానంగా చూడాలి..

## టీటీడీకి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి



**విశ్వంభర, తిరుమల:** తిరుమలలో శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించకపోవడంపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మరోసారి అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆలయాల్లో అందర్నీ సమానంగా చూస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తిరుమలలోనూ అందర్నీ సమానంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. గద్వాల నియోజకవర్గంలోని జములమ్మ అమ్మవారిని ఆదివారం నాడు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం గద్వాల బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంత నాయుడు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ఆంధ్రా ప్రాంతంతో ఉన్న ఏకైక సంబంధం తిరుపతి అని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకుని తలనీలాలు సమర్పించుకోవాలని అనుకుంటారని పేర్కొన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు గద్వాలలో నేసిన పట్టుచీరను సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా హైదరాబాద్‌లోనే ఉంటారని తెలిపారు.ఇప్పటివరకు తెలంగాణ, ఏపీ అనే తేడా లేకుండా తిరుమలలో శ్రీవారి దర్శనాలు కల్పించారని శ్రీనివాస్ గౌడ్. కానీ ఇప్పుడు తెలంగాణ భక్తులు, రాజకీయ నాయకులపై వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. సడెన్‌గా సిఫారసు లేఖలు ఆపితే భేదాభిప్రాయాలు వస్తాయని పేర్కొన్నారు. తక్షణమే తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీని కోరారు. దేవుడి దగ్గర అంతా సమానమేనని.. దీంట్లో రాజకీయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

# సదాశివపేటలో అమానవీయ ఘటన

## అప్పడే పుట్టిన శిశువును రోడ్డుపై వదిలేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**విశ్వంభర, సదాశివపేట:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. అప్పుడే పుట్టిన శిశువును గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు.
ముంబయి హైవే లోని డివైడర్‌పై పసికందును చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు శిశువును ఆస్పత్రికి తరలించారు.

# కాకినాడ తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృతి..


## విచారణకు ఆదేశించిన పవన్ కల్యాణ్



**విశ్వంభర, అమరావతి:** కాకినాడ తీరంలో ఇటీవల కాలంలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు మరణిస్తుండటంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. తాబేళ్లు మృతి చెందడానికి గల కారణాలను తెలుసుకొని, కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. వన్యప్రాణుల పరిరక్షణ చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు.

# నుమాయిష్‌కు సర్వం సిద్ధం..

## ప్రారంభ తేదీ వాయిదా




**విశ్వంభర, హైదరాబాద్:** ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 84వ అఖిల భారత వస్తు పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)కు సర్వం సిద్ధమవుతోంది. అయితే నుమాయిష్ ప్రారంభ తేదీ వాయిదా పడింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాల కారణంగా జనవరి 1న ప్రారంభం కావాల్సిన ఈ కార్యక్రమం 3వ తేదీకి వాయిదా పడింది. వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రభుత్వం సంతాప దినాలుగా ప్రకటించిందని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. 3న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎగ్జిబిషన్ ప్రారంభిస్తామని చెప్పారు.దాదాపు 45 రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. 1938లో నిజాం కాలంలో మొదలయిన నుమాయిష్‌కు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి సందర్శకులు వస్తారు.
సందర్శకుల సౌకర్యార్థం ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీభవన్, అజంతా, గోషామహల్ గేట్‌లను అందుబాటులో ఉంచింది. సీసీ కెమెరాలు, భద్రతా బలగాలతో పాటు.. సందర్శకులు మైదానంలో తిరిగేందుకు రోడ్లను ఏర్పాటు చేశారు. జమ్మూకశ్మీర్ డ్రై ఫ్రూట్స్, హ్యాండ్ క్రాఫ్ట్స్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి హస్తకళ వస్తువులు ప్రదర్శనలో ఉంటాయి. దేశంలోని అత్యుత్తమ బ్రాండ్ల ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు అన్ని రకాల స్టాల్స్ అందుబాటులో ఉంటాయి. 46 రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయి.

# ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు బలవన్మరణం..



**విశ్వంభర, సిద్దిపేట:** ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒకేరోజు ఇద్దరు కానిస్టేబుళ్ల ఆత్మహత్య కలకలం రేపింది. వేర్వేరు కారణాలతో హెడ్ కానిస్టేబుల్ సాయి కుమార్, కానిస్టేబుల్ బాలకృష్ణ బలవన్మరణానికి పాల్పడ్డారు. మెదక్ జిల్లాలో కొల్చారం పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున వాకింగ్ కోసం పీస్ వద్దకు వచ్చిన ఆయన అక్కడున్న చెట్టుకు ఉరివేసుకుని చనిపోయారు. ఆయన మృతికి వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తున్నది. ఈ ఘటనపై రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి విచారణ చేపట్టారు. ఆత్మహత్య చేసుకునే ముందు కుమార్తెకు ఫోన్ చేసినట్లు తెలిసింది. అదేవిధంగా తరచూ చనిపోతానని సాయికుమార్ అనేవారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇక, సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలకుంట కాలనీలో 17వ బెటాలియన్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. భార్యకు నీళ్లలో ఎలుకల మందు, పిల్లలకు పాలల్లో పురుగుల మందు కలిపి ఇచ్చిన బాలకృష్ణ అనంతరం తాను ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆయన మృతిచెందగా, భార్యా పిల్లలు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇంటి కొనుగోలు కోసం స్నేహితుల వద్ద అప్పులు తీసుకున్నట్లు తెలుస్తున్నది.

# మాతృభాషలోనే ప్రాథమిక విద్యా బోధన జరగాలి

## - కందుల దుర్గేశ్



**విశ్వంభర, విజయవాడ:** ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలోనే జరగాలని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మాతృభాషకు ఇతర భాషలకు తల్లిపాలకు.. పోత పాలకు ఉన్నంత తేడా ఉందన్నారు. విజయవాడలో 2 రోజుల పాటు నిర్వహించిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ముగింపు కార్యక్రమానికి దుర్గేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభల నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీరావు పేరిట ప్రధాన వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లలో తెలుగు భాషకు తూట్లు పొడిచేలా గత ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయన్నారు. ఆంగ్ల భాషలోనే భోదన జరగాలని గత ప్రభుత్వం నిర్ణయించి తెలుగుకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. "సీఎం చంద్రబాబుకు తెలుగు భాష, తెలుగు కళల పట్ల సంపూర్ణ అవగాహన ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా కళాకారుడు. భాషా వికాసానికి కారా మాస్టారి కథా నిలయం, రాజమహేంద్రవరంలోని గ్రంథాలయాలు కీలకం. సాహిత్య పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలి. భాషా పరిరక్షణలో ప్రభుత్వంతోపాటు పౌర సమాజం పాత్ర కూడా కీలకమే. యువత పుస్తకాలు చదివేలా ప్రేరేపించే చర్యలు తీసుకోవాలి. తెలుగు భాష పరిరక్షణ, ప్రోత్సాహానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భాషాభివృద్ధికి ఓ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలి" అని మంత్రి దుర్గేశ్ తెలిపారు. ఇంటా.. బయట.. మాతృభాషలోనే మాట్లాడాలని, ప్రాథమిక విద్యాభోదన తెలుగులోనే జరగాలని ప్రపంచ తెలుగు మహాసభల్లో తీర్మానం చేశారు. ఈ మేరకు ముగింపు కార్యక్రమానికి హాజరైన మంత్రి కందుల దుర్గేష్‌కు తీర్మానాల ప్రతులు అందజేశారు.

## యాదగిరిగుట్టపై దర్శన క్యూలైన్ గ్రిల్‌లో

# ఇరుక్కున్న బాలుడి తల..

## కాపాడిన భక్తులు


**విశ్వంభర, యాదాద్రి భువనగిరి :** యాదగిరిగుట్టలోలక్ష్మినరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన బాలుడుప్రమాదానికి గురయ్యాడు. సకాలంలో తొటి భక్తులు స్పందించి కాపాడడంతో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన ఓ కుటుంబం శనివారం రాత్రి యాదగిరిగుట్టకు వచ్చింది.ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక దర్శన క్యూ లైన్లో నిలబడ్డారు. ఆ సమయంలో వారి కుమారుడు దయాకర్ తల క్యూలైన్‌లోని గ్రిల్‌లో ఇరుక్కుపోయింది. దీంతో ఆందోళనకు గురైన కుటుంబం బాలుడి తలను గ్రిల్ నుంచి తీసేందుకు ప్రయత్నించి విఫలమైంది. ఈ దశలో సహచర భక్తులు కలుగజేసుకుని గ్రిల్ రాడ్లను పక్కకు తొలగించి గ్రిల్‌లో ఇరుక్కున్న బాలుడి తలను భయటకు తీయడంతో ప్రమాదం తప్పింది.



# అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన ఓయూ జేఏసీ నేతలకు బెదిరింపులు

**విశ్వంభర, హైదరాబాద్:** అల్లు అర్జున్ అభిమానుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. "ఇంటిపై దాడి చేసినందుకు వెంటనే అల్లు అర్జున్‌కు క్షమాపణ చెప్పాలని అల్లు అర్మీ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ పేరుతో వందల కాల్స్ వస్తున్నాయి. చంపేస్తామని బెదిరిస్తున్నారు. అల్లు అర్జున్ అభిమానుల నుంచి మాకు ప్రాణహాని ఉంది. మా ఫోన్ నెంబర్లు సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారు. మాకు ఫోన్ కాల్స్ రాకుండా చేయాల్సిన బాధ్యత అల్లు అర్జున్‌దే. ఫోన్ కాల్స్ ఆగకపోతే వేలాది మందితో అల్లు అర్జున్ ఇంటిని ముట్టడిస్తాం. ఫోన్ చేసి బెదిరిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి" అని ఫిర్యాదులో పేర్కొన్నారు.సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ ఇటీవల ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు ఆందోళనకు దిగారు. రేవతి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు ధ్వంసమయ్యాయి.






# కృష్ణుడిగా మహేశ్‌బాబు..

## నాగ్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు



'కల్కి 2898 ఏడీ' తో విశేష గుర్తింపు సొంతం చేసుకున్నారు దర్శకుడు నాగ్ అశ్విన్ . ఆ మూవీ పార్ట్ 2 పనుల్లో బిజీగా ఉన్న ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. మహేశ్‌బాబు గురించి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృష్ణుడి పాత్రకు టాలీవుడ్‌లో ఏ హీరోని మీరు ఎంపిక చేస్తారు? అని ఓ అభిమాని అడగ్గా.. ''కల్కి' యూనివర్స్‌లో కృష్ణుడి పాత్రధారి ముఖం కనిపించకూడదని నిర్ణయించుకున్నా. ఒకవేళ పూర్తిస్థాయి పాత్రలో మహేశ్ బాబు నటిస్తే అభిమానులకు పండగే అనుకుంటా. టీజర్ రిలీజ్‌కు ముందే ఆల్‌టైమ్ బ్లాక్ బ్లస్టర్‌గా నిలుస్తుందనిపిస్తుంది. 'ఖలేజా'లో ఆయన పోషించిన పాత్ర (దేవుడిలాంటి క్యారెక్టర్) నాకు ఇష్టం'' అని చెప్పారు.

రెండు భాగాలుగా సినిమాలు రూపొందడంపై మాట్లాడుతూ.. ''కథను బట్టి మార్పులు చోటు చేసుకుంటాయి. కొందరు రెండు పార్ట్‌లను ఒకేసారి చిత్రీకరిస్తారు. దాని వల్ల బడ్జెట్‌పై పెద్దగా ప్రభావం ఉండదు. అదే రెండు పార్ట్‌లు రెండు సార్లు షూట్ చేస్తే బడ్జెట్ పెరుగుతుంది. 'కల్కి' విషయానికొస్తే చిట్టీలు వేసి రెండు భాగాలుగా చేశాం (నవ్వుతూ). పెద్ద కథ, సింగిల్ పార్ట్ అనే ఆలోచనతోనే టీమ్ అంతా పని చేస్తూ వచ్చాం. 'ఇది రెండు పార్ట్‌లు అయ్యేలా ఉంది' అని ఒకానొక సమయంలో ప్రభాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. నేను లేదు సర్.. ఎడిటింగ్ కట్ చేయొచ్చు అని చెప్పేవాడిని. తర్వాత చిట్టీలతో 2 పార్ట్‌లు చేశాం'' అని తెలిపారు.'కల్కి'లోని ప్రభాస్ క్యారెక్టర్‌పై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. ''అర్షద్‌లాంటి వారు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన అంచనాలు పెట్టుకుని చూడడం వల్ల భైరవ పాత్ర నచ్చలేదేమో. మరోవైపు, ఓ సందర్భంలో ఇద్దరు చిన్నారులు వచ్చి భైరవ మాకు బాగా నచ్చాడు అని చెప్పారు. కిడ్స్ ఎప్పుడూ బెస్ట్ ఆడియన్స్'' అని సమాధానమిచ్చారు.



# తనకున్న అడిక్షన్‌ను బయిట పెట్టేసిన కస్తూరి

అలనాటి నటి కస్తూరి శంకర్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. స్టార్ మాలో ప్రసారమైనా 'ఇంటింటి గృహలక్ష్మి' సీరియల్ ద్వారా తులసిగా తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఈ సీరియల్ తో కస్తూరి బుల్లితెరపై ఎనలేని ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఆమె నటి గానే కాకుండా.. అనలిస్ట్, సోషల్ యాక్టివిస్ట్ సేవలందిస్తున్నారు. అయితే.. ఈ అమ్మడు ముక్కు సూటిగా మాట్లాడుతూ ఎన్నో సమస్యల్లో కూరుకుపోతుంటారు. అయితే తాజా ఈ నటి ఓ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్ లోని పలు విషయాలను వెల్లడించింది. ఆ ఇంట్రెస్టింగ్ విషయాలేంటీ?

సీనియర్ నటి కస్తూరి శంకర్ అలియాస్ కస్తూరి. తొలుత ఫ్యాషన్ రంగంపై ఇంట్రెస్ట్ తో మోడలింగ్ అడుగుపెట్టింది. అలా 1991లో మిస్ చెన్నైగా గెలుపొందారు. ఆ తర్వాత ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో ఫైనలిస్ట్‌గా సెలక్ట్ అయ్యారు కస్తూరి. ఈ ఫేమ్ తో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. తన అందం, అభినయంతో వరుస అవకాశాలను అందుకుంటూ.. వరుస విజయాలు అందుకుంది. ఈ తరుణంలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో నటించింది. ఇలా తెలుగులో గ్యాంగ్ వార్ చిత్రం ద్వారా పరిచయమయ్యారు.

ఆ తరువాత బాలకృష్ణతో నిప్పు రవ్వ, చిలక్కొట్టుడు, అన్నమయ్య సినిమాల ద్వారా మరింత గుర్తింపు తెచ్చుకొన్నారు. ఆకాశ వీధిలో, శమంతకమణి, గాడ్ ఫాదర్, సింబా సినిమాల్లో నటించి మెప్పించారు. ఇక తన కెరీర్ పిక్ స్టేజ్ లో ఉన్నప్పడే వివాహం చేసుకుని సినిమాలకు దూరమైంది. అనంతరం కొంత కాలానికి సెకండ్ ఇన్సింగ్స్ ప్రారంభించారు.తన సెకండ్ ఇన్నింగ్స్ లో అమ్మ,అక్క, వదిన వంటి పాత్రల్లో నటిస్తూ.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు తెంచుకుంది. ఈ సమయంలో బుల్లితెరపైనా ఎంట్రీ ఇచ్చినా ఈ అమ్మడు దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ సీరియల్స్, షోలు చేస్తూ.. ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే.. సోషల్ మీడియాతో నిత్యం యాక్టివ్ గా ఉంటూ తన ద్రుష్టికి వచ్చిన విషయాలపై తన అభిప్రాయాలను వెల్లడిస్తోంది. తాజాగా.. తెలుగు వారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసింది. దీంతో కస్తూరిపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో ఆమె ఇబ్బందుల్లో పడింది. తెలుగు వారాంతా ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దీంతో ఆమెపై కేసు నమోదు అయింది. ఈ కేసులో కస్తూరి శంకర్ మూడు రోజుల పాటు రిమాండ్ ఖైదీగా జైలు జీవితం కూడా గడిపారు. బెయిల్ పై బయటకు వచ్చారు. ఇదిలా ఉండగా, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో యాంకర్ మాట్లాడుతూ కస్తూరి గారు మీకు ఓ అడిక్షన్ ఉందట కదా.. ఆ విషయాన్ని బయట పెట్టమంటే పెడతానంటూ అంటుంది. 'ఇప్పటికే తనను తమిళనాడులో తాగుబోతు అంటున్నారు. ఇప్పుడేమో అడిక్షన్స్ అంటున్నారు వద్దులే' అంటుంది. కానీ ఆ యాంకర్..'ఆ అడిక్షన్ ఏంటంటే.. రాత్రి 9 దాటితే కస్తూరి గారికి ఉవ్విల్లూరుతాయి. ఆ కోరికను వద్దు.. వద్దు.. అని తనకు తాను చెప్పకున్న.. ఆ కోరికను ఓవర్ కం కాలేకపోతున్నారని అంటుంది.


ఆ కోరిక ఏమిటంటే.. అనగానే.. కస్తూరి మాట్లాడుతూ.. 'అప్పడప్పడు ఆ కోరిక తీర్చుకోవడానికి తాను లొంగిపోతున్నా.. కొన్నిసార్లు తెల్లారి అది తలుచుకుని గిల్టీగా ఫీల్స్ అవుతున్నా.. మరోసారి దాన్ని జోలికి వెళ్లొద్దని భావిస్తాను. కానీ దానికి అడిక్ట్ అయిపోయాను అంటూ.. రాత్రి 9 దాటితే బంగాళదుంప చిప్స్ తినకపోతే తనకు ఆ రాత్రి నిద్ర పట్టదు 'అంటూ అసలు విషయాన్ని బయట పెట్టేసింది నటి కస్తూరి శంకర్.

# జనవరి 3న 'పా.. పా..' విడుదల



గత ఏడాది తమిళంలో విడుదలైన 'డా..డా' మూవీ సెన్సేషనల్ హిట్ సాధించింది. కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా, డైరెక్టర్ గణేష్‌కె బాబు తెరకెక్కించిన 'డా..డా' చిత్రం తమిళ ఆడియన్స్‌ని విపరీతంగా ఆకట్టుకుంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్‌లకు కాసుల వర్షం కురిపించింది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా సుమారు 30 కోట్లు వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసుకుంది. హార్ట్ టచ్ అయ్యే పాటలు ఈ సినిమాకు మరో హైలైట్ అని చెప్పుకోవచ్చు. ఒకప్పటి పాపులర్ సాంగ్స్ మాదిరిగానే ఈ సినిమా పాటలు స్థిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. తండ్రి కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'డా..డా' చిత్రం 'పా.. పా..' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుందని నిర్మాత నీరజ కోట తెలిపారు. భావోద్వేగం, ప్రేమ, కామెడీ.. ఇవన్నీ సరైన స్థాయిలో మిక్స్ చేసిన ఈ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా.. తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్టు అవుతుందని, బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయమన్నారు. జనవరి 3న విడుదులయ్యే ఈ మూవీని తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు విడుదల చేయబోతున్నారని చెప్పారు.

# 'లైలా' ఫస్ట్ సింగిల్ వీడియో సాంగ్ రిలీజ్



మాస్‌కా దాస్ విశ్వక్సేన్ అప్ కమింగ్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా' వాలంటైన్ డే కానుకగా ఫిబ్రవరి 14, 2025న విడుదల కానుంది. ఈ చిత్రంలో విశ్వక్సేన్ అబ్బాయిగా, అమ్మాయిగా రెండు క్యారెక్టర్స్ పోషించి తన వెర్సటాలిటీ చూపించబోతున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే స్ట్రయికింగ్ ఫస్ట్ లుక్ టైటిల్ పోస్టర్‌తో దృష్టిని ఆకర్షించింది. మ్యూజిక్ ప్రమోషన్స్ ని కిక్‌స్టార్ట్ చేస్తూ, మేకర్స్ ఫస్ట్ సింగిల్ సోను మోడల్ వీడియో సాంగ్ విడుదల చేశారు. ఈ పాట విశ్వక్సేన్ పాత్ర, సోను మోడల్‌ను పరిచయం చేస్తుంది. అతని పర్సోనా పై ఒక గ్లింప్స్ అందిస్తుంది. ఇది సోను చార్మ్, తన ప్రత్యేక స్కిల్స్ తో అమ్మాయిల మనసులని ఎలా గెలుచుకుంటాడో హైలైట్ చేస్తుంది. లియోన్ జేమ్స్ కంపోజ్ చేసిన ట్యూన్ ఆకట్టుకునే బీట్‌లతో మెస్మరైజ్ చేస్తుంది. ఈ వైబ్ ఏంథంకి విశ్వక్సేన్ స్వయంగా లిరిక్స్ రాస్తూ ఫన్ నంబర్‌కు పర్సనల్ టచ్ జోడించారు. ఈ పాటను సింగర్స్ నారాయణ్ రవిశంకర్, రేష్మా శ్యామ్ ఎనర్జిటిక్ గా పాడారు. విశ్వక్సేన్, ఎనర్జీతో నిండి, తన డైనమిక్ డ్యాన్స్ మూమెంట్స్ ని ప్రజెంట్ చేశారు. లావిష్‌గా చిత్రీకరించిన ఈ పాట విజువల్ ఫీస్ట్‌ను అందిస్తుంది. ఈ సాంగ్ చార్ట్‌బస్టర్ బిగినింగ్ తో మూవీ మ్యూజికల్ ప్రమోషన్స్ కి స్టేజ్ ని సెట్ చేసింది. ఈ మూవీతో ఆకాంక్ష శర్మ కథానాయికగా అరంగేట్రం చేస్తోంది. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. వాసుదేవ మూర్తి స్క్రీన్ ప్లే అందించగా, రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చగా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్ భాద్యతలు నిర్వహిస్తున్నారు.

# 4న థియేటర్ నిర్వహణను మైత్రీ మూవీస్ తీసుకుంది: సంధ్య థియేటర్ యాజమాన్యం



**హైదరాబాద్:** ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో థియేటర్ యాజమాన్యానికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. సంధ్య థియేటర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని పేర్కొంటూ తెలంగాణ పోలీసులు ఇచ్చిన నోటీసులకు థియేటర్ యాజమాన్యం సమాధానం పంపింది. '' డిసెంబరు 4న పుష్ప2 ప్రీమియర్ షోకు 80 మంది థియేటర్ సిబ్బంది విధుల్లో ఉన్నారు. డిసెంబరు 4, 5న థియేటర్ నిర్వహణను మైత్రీ మూవీ మేకర్స్ తీసుకుంది. సినిమాల విడుదలకు గతంలోనూ హీరోలు థియేటర్‌కు వచ్చారు. సంధ్య థియేటర్‌లో కార్లు, బైక్‌లకు ప్రత్యేక పార్కింగ్ ఉంది'' అని తెలిపింది. ఈ మేరకు 6 పేజీల లేఖను సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు పంపింది.

డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి ఇప్పటికే మైత్రీ మూవీ మేకర్స్ రూ. 50లక్షలు, హీరో అల్లు అర్జున్ రూ.కోటి, దర్శకుడు సుకుమారు రూ.50లక్షలు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.25లక్షలు సాయం అందించారు.



'మ్యాడ్ స్క్వేర్' రెండవ గీతం

# 'స్వాతి రెడ్డి' విడుదల

మ్యాడ్ స్క్వేర్ చిత్రం కోసం తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 2023 లో విడుదలైన మ్యాడ్ మొదటి భాగం సంచలన విజయం సాధించడంతో, కేవలం ప్రకటనతోనే రెండవ భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా 'మ్యాడ్ స్క్వేర్' ప్రచార చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా 'మ్యాడ్' విజయంలో సంగీతం కీలక పాత్ర పోషించింది. దీంతో 'మ్యాడ్ స్క్వేర్' పాటలపై ప్రేక్షకుల్లో ఎంతో ఆసక్తి ఉంది. 'లడ్డు గాని పెళ్లి' అంటూ ఈ చిత్రం నుంచి విడుదలైన మొదటి గీతంకి విశేష స్పందన లభించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'స్వాతి రెడ్డి' అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్ర బృందం. 'లడ్డు గాని పెళ్లి' తరహాలోనే విన్న వెంటనే కట్టిపడేసేలా ఎంతో ఉత్సహంగా ఈ గీతం సాగింది.

సురేష్ గంగుల సాహిత్యం ప్రేక్షకుల నాడిని పట్టుకున్నట్టుగా ఉంది. అందరూ పాడుకునేలా తేలికైన పదాలతో అద్భుతమైన సాహిత్యం అందించారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ల త్రయం మరోసారి నవ్వించడానికి వస్తున్నారు. మొదటి భాగానికి మించిన వినోదాన్ని పంచడానికి ఈ ముగ్గురు సిద్ధమవుతున్నారు. అదే ఉత్సాహం తాజాగా విడుదలైన రెండవ గీతంలోనూ కనిపించింది. ఇక ఈ పాటలో రెబా మోనికా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పాట ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.

మ్యాడ్ సినిమాలో తనదైన ప్రత్యేక శైలి హాస్య సన్నివేశాలు, ఆకర్షణీయమైన కథనంతో ఎంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్, ఈ సీక్వెల్ తో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు. ఈ 'మ్యాడ్ స్క్వేర్' చిత్రానికి ప్రముఖ ఛాయాగ్రాహకుడు శామ్‌దత్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగ వంశీ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై శ్రీకర స్టూడియోస్ తో కలిసి హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 26, 2025న థియేటర్లలో అడుగు పెట్టనుంది.

# ఈ ఏడాది 199 చిత్రాల్లో 26 మాత్రమే హిట్.. రూ.700 కోట్ల నష్టం!




2024లో ఎన్నో అద్భుతమైన కథలను ప్రేక్షకులకు అందించింది మలయాళ చిత్ర పరిశ్రమ. యువ, అగ్ర కథానాయకులు విభిన్న చిత్రాలతో వినోదాన్ని పంచారు. ఆ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన ఎన్నో సినిమాలు వేరే భాషల్లోనూ విజయాలు అందుకున్నాయి. అయితే.. ఈ ఏడాది తమకు రూ.700 కోట్ల నష్టం వాటిల్లిందని కేరళ చిత్ర నిర్మాతల అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ ఏడాది మొత్తంగా 199 చిత్రాలు వచ్చాయని.. సుమారు రూ.1000 కోట్లు ఖర్చు అయిందని తెలిపింది. అందులో కేవలం 26 చిత్రాలు మాత్రమే విజయాన్ని అందుకున్నాయని వెల్లడించింది. పెట్టిన ఖర్చులో కేవలం రూ.300 కోట్లు మాత్రమే తిరిగి పొందగలిగామని.. రూ.700 కోట్లు నష్టపోయామని చెప్పింది. నిర్మాణ విలువ, హీరోల పారితోషికం భారీగా పెరగడం వల్ల తమకు రావాల్సిన ఆదాయం భారీగా తగ్గిందని పేర్కొంది.

'మంజుమ్మల్ బాయ్స్', 'ఆడు జీవితం', 'ఏ.ఆర్.ఎం.', 'ఆవేశం', 'ప్రేమలు', 'భ్రమయుగం', 'సూక్ష్మ దర్శిని' వంటి సినిమాలు విడుదలై విజయాన్ని అందుకున్నాయి. తెలుగులోనూ ఆయా చిత్రాలకు విశేష గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేరళ చిత్ర నిర్మాతల అసోసియేషన్ ఇలాంటి ప్రకటన విడుదల చేయడం అంతటా చర్చనీయాంశమైంది. ఫిబ్రవరిలో విడుదలైన 'మంజుమ్మల్ బాయ్స్' రూ.240 కోట్ల గ్రాస్ వసూలు చేసి ఈ ఏడాది అత్యధిక వసూళ్లు రాబట్టిన మలయాళ చిత్రంగా నిలిచింది. పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ఆడు జీవితం', టొవినో థామస్ యాక్ట్ చేసిన 'ఏ.ఆర్.ఎం', నస్లేన్ కె. గఫూర్, మమతా బైజు జంటగా నటించిన 'ప్రేమలు' రూ.100 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టాయి. కొత్త చిత్రాలు మాత్రమే కాకుండా ఒకప్పటి హిట్ చిత్రాలు కూడా ఈ ఏడాది రీ రిలీజ్ అయ్యాయి. మోహన్‌లాల్ నటించిన 'దేవదూతన్', 'మణిచిత్రతాళు' సినిమాలను రీరిలీజ్ చేయగా మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com